




గెలిచాం : విజేత గోపీమూర్తి

టీచర్ల సమస్యలు పరిష్కరిస్తా

- సీపీఎస్ రద్దుకు కృషి
- మండలిలో గళమెత్తుతా
- ఎమ్మెల్సీ గోపిమూర్తి

కలెక్టరేట్ (కాకినాడ)/కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో గళమెత్తి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారంకాని సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు అప్పగించే పనుల కారణంగా పాఠ్యాంశాలు బోధించడంలో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు హెల్త్‌కార్డులు జారీచేయాలని కోరతానన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు శాసనమండలిలో గళమెత్తుతానన్నారు. ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మినిమం స్కేల్ ప్రకారం జీతాలిచ్చే విధంగా ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇతర అభ్యర్థి ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ఉపాధ్యాయులు వాటిని అధిగమించి తనను గెలిపించారన్నారు. ఈమేరకు అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఎమ్మెల్సీ గోపిమూర్తి పేర్కొన్నారు.



మనదే విక్టరీ : ఆనందంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజేత గోపిమూర్తి అభివాదం

మూర్తీభవించిన.. విజయం

ఎమ్మెల్సీ విజేత గోపిమూర్తి

కాకినాడ/కాకినాడకలెక్టరేట్/కార్పొరేషన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అంతా ఊహించినట్టే జరిగింది. ఓట్ల లెక్కింపు అంతా వార్ వన్‌సైడ్ తరహా అయింది. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి ముగిసే వరకు పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి స్పష్టమైన ఆధిక్యతతో దూసుకుపోయారు. దీంతో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపిమూర్తి 9,165 ఓట్లతో విజయ కేతనం ఎగురవేశారు. కాకినాడ జేఎన్టీయూలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లైబ్రరీలో సోమవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమైంది. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సమక్షంలో అధికారులు బ్యాలెట్ బాక్సులు తెరిచి ఓట్ల లెక్కింపు మొదలుపెట్టారు. యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థి గోపిమూర్తి గెలుపొందడంతో ఇటు ఉపాధ్యాయ సంఘాలు, అటు బలపర్చిన ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో జేఎన్‌టీయూ ఉపాధ్యాయులతో కోలాహలంగా మారింది.

ఆది నుంచీ ఆధిక్యత..



గోపిమూర్తికి ధ్రువీకరణ పత్రం ఇస్తున్న కలెక్టర్

మొత్తం 14 టేబుళ్లపై 76 మంది ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ పత్రాలు లెక్కించారు. ప్రతి 50 ఓట్లను కట్టలుగా విభజించి కౌంటింగ్‌కు సిద్ధంచేశారు. ప్రాధాన్య ఓట్ల ప్రకారం ఎవరికి ఎన్ని వచ్చాయో ఏజెంట్ల సమక్షంలో లెక్కించారు. ఈనెల 5న జరిగిన ఉప ఎన్నికల్లో మొత్తం ఆరు జిల్లాల పరిధిలో 15,494 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపులో భాగంగా 814 ఓట్లు చెల్లనివిగా నిర్ధారణ అయ్యాయి. ఇవి పోను మిగిలిన 14,680 ఓట్లు లెక్కించగా యూటీఎఫ్ బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి 9,165 ఓట్లు లభించాయి. ఓట్ల లెక్కింపు దగ్గర నుంచి చివరి వరకు పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి ఆధిక్యత కనబర్చారు. మరో అభ్యర్థి గంధం నారాయణరావుకు 5,259 ఓట్లు లభించడంతో రెండో స్థానంలో నిలిచారు. నారాయణరావు ఒక దశలో కొంత వరకు పోటీ ఇచ్చారు. దీంతో కాసేపు విజయంపై ఉత్కంఠ కొనసాగింది. కానీ కాసేపటికే గోపిమూర్తికి ఆధిక్యత పెరిగి విజయం ఏకపక్షమైంది. మిగిలిన అభ్యర్థుల్లో దీపక్ పులుగు 102, నామన వెంకటలక్ష్మి 81, డాక్టరు కవల నాగేశ్వరరావు 73 ఓట్లతో ప్రభావం చూపలేకపోయారు. చెల్లిన ఓట్ల ఆధారంగా విజయం సాధించడానికి 7,341 ఓట్లు రావాల్సి ఉండగా పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి 9,165 ఓట్లు కైవసం చేసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆమోదంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ఆయన గెలుపొందినట్టు ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.



కౌంటింగ్ సాగిందిలా : 14 టేబుళ్లపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

- 9,165 ఓట్లతో జయ కేతనం
- తొలి నుంచీ స్పష్టమైన ఆధిక్యత
- ఏకపక్షంగా సాగిన ఫలితం
- కౌంటింగ్ కేంద్రం వద్ద సంబరం
- మొత్తం పోలైన ఓట్లు 15,494
- చెల్లనివి 814.. లెక్కింపు 14,680
- రెండో స్థానంలో నారాయణరావు

ఈ టీచర్లకు ఓటేయడం రాదా..

కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా అధికారులు కొన్ని ఓట్లు చూసి అవాక్కయ్యారు. నిర్దేశిత నమూనాలో కాకుండా చాలామంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు తప్పుగా వినియోగించుకోవడం చూసి విస్తుపోయారు. మొత్తం 814 ఓట్లు చెల్లకపోవడంతో వాటన్నింటినీ పక్కన పెట్టేశారు. వాస్తవానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థులకు ఓటర్లు ప్రాధాన్యత క్రమంలో టిక్ పెట్టి ఓట్లు వేయాలి. కానీ చాలామంది అభ్యర్థి ఎదురుగా కాకుండా ఎగువ దిగువలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయా సంఘాలు ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు శిక్షణ ఇచ్చారు. అయినా చెల్లని ఓట్లు భారీగా పడడం విశేషం.



ఏజెంట్లకు చెల్లని ఓట్లను చూపుతున్న సిబ్బంది







అమలాపురం కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్.. తాగునీటి కోసం అర్జీ అందించిన మహిళలు.. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గెద్దనపల్లి మత్స్యకారులు

సీఎం, మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనివ్వాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశం.. జిల్లా కలెక్టరేట్‌లో 168 అర్జీల స్వీకరణ

అమలాపురం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, మంత్రుల కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి 15 రోజుల కాల వ్యవధిలో వాటిని పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులను పరిష్కరించే సమయంలో అర్జీదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ఆయా సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డ్వామా పీడీ ఎస్ మధుసూదన్, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణిలు కలెక్టర్‌తో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 168 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కోసం కార్యక్రమంలో సామాజిక భద్రతా పెన్షన్ల మంజూరు, వైద్య సేవలు, భూసమస్యలు వంటి అంశాలపై అధికంగా అర్జీలు అందుతున్నాయన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మద్యం షాపు తొలగించాలి..

అంతర్వేది దేవస్థానం గ్రామంలో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన మద్యం షాపును తొలగించి మరోచోట ఏర్పాటుచేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఇళ్ల మధ్య మద్యం షాపు వల్ల కొత్తగా గృహాలు నిర్మించుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. గుర్రం దాసుతోపాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీరు అందించండి...

అమలాపురం పట్టణ పరిధి 30వ వార్డు గొవ్వాలవారి వీధిలో గత 45 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఇంతవరకు పరిష్కరించలేదు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని ప్రకటించి ఇప్పటివరకు ఒక్క ట్యాంకరు మాత్రమే పంపించి చేతులు దులుపుకున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటిని కొనుగోలు చేసుకుని తాగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

గెద్దనపల్లి మత్స్యకారుల నిరసన

చమురు సంస్థలు మత్స్యకారులకు అందించిన రూ.80 లక్షలను ఒప్పందం మేరకు అందరికీ సమంగా పంచాలని కాట్రేనికోన మండలం గెద్దనపల్లి మత్స్యకారులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. నెలల తరబడి సొమ్ములు పంపిణీ చేయకుండా కొందరు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. మత్స్యకార పెద్దలు చెప్పినా పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు ఇచ్చిన అర్జీలో పోతాబత్తుల నారాయణరావు, అంగాని ఆంజనేయులు, పట్టా లక్ష్మణ్, మల్లాడి శ్రీను, చింతా రాంబాబు, చింతా లోవరాజు తదితరులు పేర్కొన్నారు.

పోషణ ఖర్చులు ఇప్పించండి

పిల్లల చిన్నతనంలోనే భర్త చనిపోయినా కూలి పనిచేసుకుని ఇద్దరు ఆడ బిడ్డలకు పెళ్లిళ్లు చేశా. కొడుకుని చదివించా. భర్త సంపాదించిన ఆస్తులన్నీ కొడుకు పేరునే పెట్టా. నా పేరున చిల్లిగవ్వ లేదు. ఇప్పుడు బిడ్డ కనీస పోషణ ఖర్చులూ ఇవ్వడం లేదు. అధికారులు స్పందించి బతికేందుకు దారిచూపాలి.

- పీవీ సత్యకుమారి, రావులచెరువు



సమీక్షలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

నేటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు : జేసీ

అమలాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): భూవివాద రహిత గ్రామాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు ముందుకు వచ్చిందని జేసీ టి.నిషాంతి పేర్కొన్నారు. మంగళవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామాల్లో అత్యంత పకడ్బందీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఇతర శాఖల అధికారులకు ఆమె కలెక్టరేట్ నుంచి సోమవారం దిశానిర్దేశం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు పూర్తి అయినందున సదస్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఈ సదస్సుల్లో పరిష్కరిస్తామన్నారు. ఆర్డీవోలు రోజుకు రెండు సదస్సులను తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. రీసర్వే జరగని గ్రామాల్లో తొలుత ఈ సదస్సులు నిర్వహించాలని సూచించారు. పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో ఒక ఆప్షన్‌ను రెవెన్యూ సదస్సులకు ఇవ్వడం జరిగిందని, దానిలో రోజువారీ ఫిర్యాదులు, పరిష్కార వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. సాధ్యమైనంత వరకు ఎక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి అధికారుల బృందం చర్యలు చేపట్టాలన్నారు. క్లిష్టమైన సమస్యలను ప్రొసీజర్ ప్రకారం తదుపరి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏ గ్రామంలో ఎప్పుడు రెవెన్యూ సదస్సు జరుగుతుందో ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, భూసమస్యలపై ప్రజలు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండా అధికారులే జనం వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు.





నృత్య ప్రదర్శన.. మట్టితో బొమ్మలు

సంప్రదాయాల పరిరక్షణకు

సంస్కృతి ఉత్సవ్ -2024 పోటీలు

అమలాపురం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ విద్యార్థుల కళాత్మక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ నృత్య ప్రదర్శనల్లో భాగంగా విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యంతోపాటు పల్లె ప్రజల జీవనశైలిని ప్రతిబింబిస్తూ జానపద నృత్యాల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. మేము గోదారోళ్లమండి.. మా ఊరూ పల్లెటూరు.. అంటూ సాగిన జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆకొండి గోపాలకృష్ణమూర్తి ట్రస్టు ఆధ్వర్యంలో సంస్కృతి ఉత్సవ్-2024 పోటీలు అమలాపురం యర్రమిల్లివారి వీధిలోని శ్రీసకల కార్యసిద్ధి హనుమాన్‌మందిరం వద్ద సోమవారం ఉల్లాసంగా.. ఉత్సాంగా నిర్వహించారు. ఎల్‌కేజీ నుంచి పీజీ తరగతుల విద్యార్థుల వరకు పలు పోటీలను వేర్వేరు విభాగాలుగా నిర్వహించారు. భగవద్గీత శ్లోకాలు, వక్తృత్వ పోటీలు, రామాయణం, భారతీయ విజ్ఞాన వైభవంపై రాత పరీక్ష నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రధానంగా ఆరు నుంచి పది తరగతుల వారికి మట్టితో బొమ్మలు తయారుచేసే పోటీని నిర్వహించారు. విద్యార్థులు ప్రకృతిలోని అనేక అందాలను మట్టితో బొమ్మలుగా తయారు చేశారు. పల్లెటూరు, పచ్చని పొలాలు, వరి నాట్లు, ఆలయాలు, పాత నుయ్యిలు ఇలా ఒక్కటేమిటి ఎన్నో ఆకృతులను మట్టితో తీర్చిదిద్ది అబ్బురపరిచారు. ట్రస్టు చైర్మన్ ఆకొండి పవన్ ఆధ్వర్యంలో జరిగిన ఆయా పోటీలకు న్యాయ నిర్ణేతల సమక్షంలో విజేతల ఎంపిక జరిగింది. ఈనెల 10న హనుమద్వ్రత పూజా మహోత్సవాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని పవన్ తెలిపారు.

- ఆంధ్రజ్యోతి/ఆలమూరు



పంటల సాగులో.. ఇక 'నానో' శకం!

భూమికి అపకారిగా మారిన ఎరువుల వాడకం తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతుల్లో భాగంగా 'నానో' లిక్విడ్‌ను తీసుకొచ్చారు. ఎరువులతో సమానంగా పనిచేసే నానో వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయశాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యవసాయ రంగంలో సాగు చేసే అన్ని రకాల పంటలకు నానో ఎంతగానో ఉపయోకరంగా ఉంటుందంటున్నారు. భారతదేశంలో ఎరువులు తయారు చేసే అన్ని కంపెనీలు ప్రస్తుతం ఈ నానో లిక్విడ్ తయారీపై దృష్టి పెట్టాయి. వీటి వాడకం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే వీలుంటుందని.. ముఖ్యంగా భూమికి ఎటువంటి ప్రమాదం ఉండదని వ్యవసాయాధికారులు ఇటీవల కాలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- ఎరువులకు బదులుగా నానో పెస్టిసైడ్ లిక్విడ్స్
- ఎరువులు వద్దు నానో ముద్దు అంటున్న శాస్త్రవేత్తలు
- భవిష్యత్ అంతా 'నానో'దే
- ఇంకా ఆసక్తి చూపని రైతులు

నానో లిక్విడ్.. ప్రయోజనాలెన్నో..

ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో లిక్విడ్‌ను ఉపయోగించడం వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. అలాగే ఉత్పత్తి పెంపుదలతోపాటు ఆదాయం పెరుగుతుంది. నేల, గాలి, నీరు కలుష్యాన్ని తగ్గిస్తుంది. తెగుళ్లు, వ్యాధులను తగ్గిస్తుంది. ఉత్పత్తి నాణ్యతను పెంచుతుంది. పూర్తిగా హాని చేయనిది. పంటలకు జీవులకు సురక్షితమైనది. నిల్వ చేయడం, రవాణా సులభతరం కావడంతో పాటు లాభదాయకంగా ఉంటుంది.

నానో వాడకం ఇలా..

కొంతకాలంగా మార్కెట్‌లో లభ్యమవుతున్న ఈ నానో ఎరువుల గురించి రైతు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎరువులతో పోల్చితే నానో వాడకం సులభతరంగా భావిస్తున్నారు. పైరు ఎదుగుదలకు వాడే ఎరువులకు బదులుగా వాడే ఈ నానో లిక్విడ్ ద్రవ రూపంలో లభ్యమవుతుంది. భూమిలో చల్లకుండా కేవలం పైరుపై పురుగుమందుల మాదిరిగానే పిచికారి చేస్తే ఎరువులు వేసిన దాని మంచి ప్రయోజనం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పిచికారీ చేయడం వల్ల భూమికి ఎటువంటి హాని చేయదు.

ఎరువులతో పోల్చితే అధిక లాభం..

ఎరువుల వాడకంతో పోల్చితే నానో వాడకం వల్ల అధిక లాభదాయంగా ఉంటుంది. ఉదాహరణకు ఎకరం భూమికి పంటను బట్టి డీఏపీ 50 నుంచి 75 కిలోలు వాడుతుంటారు. దీనివల్ల డీఏపీ 50కిలోల బస్తా రూ.1350కు మార్కెట్లో లభ్యమవుతోంది. దీనిని బట్టి చూస్తే దాదాపు ఎకరానికి రూ.రెండు వేల వరకు ఖర్చు. నానో 500 ఎంఎల్ బాటిల్ ఎకరానికి సరిపోతుంది. ఈ బాటిల్ ఖరీదు రూ.600. అంటే ఎంత తక్కువ ఖర్చో చూడండని రైతులకు అధికారులకు అవగాహన కల్పిస్తున్నారు.

రైతుల్లో ఆసక్తి అంతగా లేదు

కొత్తగా మార్కెట్లోకి వచ్చిన ఈ కొత్త నానో లిక్విడ్స్ పట్ల రైతులు ఆసక్తి చూపించడం లేదు. ఎరువుల వాడకానికి అలవాటు పడిన రైతులు లిక్విడ్‌ను వాడకం వల్ల పంట దిగుబడులు ఏవిధంగా ఉంటాయోనని భయపడుతున్నారు. దీంతో వీటిని వాడడానికి రైతులు వెనుకడుగు వేస్తున్నారు. అయితే సహకార సంఘాలు, ఎరువుల డీలర్లు రెండు బస్తాలు కావాలంటే ఒక బాటిల్ కొనాల్సిందేనని ఆంక్షలు పెడుతున్నారు. దీంతో కొంతమంది రైతులు కొనుగోలు చేసినప్పటికీ వాడకకుండా వదిలేస్తున్నారు.



భవిష్యత్ అంతా నానోదే..

భవిష్యత్ కాలంలో ఎరువులకు బదులుగా నానో లిక్విడ్ వాడకమే ఉంటుంది. ఎందుకంటే ఎరువులకంటే నానో సురక్షితం. అందుకే రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. నానో వాడకం వల్ల భూమికి ఎటువంటి హాని ఉండదు. పైగా పెట్టుబడి కూడా ఆదా అవుతుంది.

-కె.నాగేశ్వరరావు, ఏడీఏ, ఆలమూరు మండలం









గుడ్‌లక్ బేంబో.. ముచ్చటగా!

శుభాలనిచ్చే మొక్కలు ఎన్నో రూపాల్లో..

(ఆంధ్రజ్యోతి - కడియం)

నిత్యం ఆకుపచ్చగా అలరారే ఇండోర్ ప్లాంట్ రకం మొక్క. గుడ్‌లక్ బేంబో. కేవలం నీళ్లలోనే పెరిగే ఈ వెదురు జాతి మొక్క చైనాలో ఉత్పత్తి అవుతుంటాయి. వీటిని మన కడియం నర్సరీలకు దిగుమతి చేసుకుంటారు. రకరకాల ఆకారాల్లో ఈ మొక్క కొలువుదీరి అందరినీ కనువిందు చేస్తాయి. ఆకారం, పరిమాణాన్నిబట్టి గుడ్‌లక్ బేంబో ధర ఉంటుంది. అంటే రూ.500 నుంచి రూ.50 వేల దాకా. ఇది సూర్యరశ్మి వెలుతురు లేకుండానే చక్కగా నిగారింపుతో పెరిగే మొక్క. గుడ్‌లక్ బేంబో ఇంటిలో ఉంటే అంతా శుభం అనేది చైనీయుల విశ్వాసం. ఈ మొక్కను ఇంటిలో ఉంచుకుంటే శుభాలు కలుగుతాయని అందుకే 'గుడ్‌లక్' అని, వెదురు కాబట్టి 'బేంబో' అని, వెరసి గుడ్‌లక్ బేంబోగా, లక్కీ బేంబోగా పిలుస్తారు. ప్రతీ శుభకార్యానికి బహుమతులు బదులు మొక్కలు ఇవ్వడం ట్రెండ్‌గా మారింది. ఇటీవల ఈ మొక్కను పుట్టినరోజు, వివాహ వేడుకలు, నూతన సంవత్సరం, అధికారులు ఉన్నతాధికారులకు మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. గుడ్‌లక్ బేంబో మొక్కను ఇండోర్ మొక్కగా షోకేజ్‌లు, టీపాయ్‌లు, అల్మారా, టీవీ స్టాండ్‌లు, బెడ్‌రూమ్‌లోను పెట్టుకోవచ్చు. సముద్రపు నీరు తగలకుండా స్వచ్ఛమైన నీటిని రెండు రోజులకొకసారి తగిన మోతాదులో పోసుకుంటే సరిపోతుంది. ప్రస్తుతం కడియం నర్సరీలో వివిధ ఆకృతుల్లో, వివిధ పరిమాణాల్లో గుడ్‌లక్ బేంబోలు రమణీయంగా దర్శనమిస్తున్నాయి.



ఆరోజు రానివారికి.. కబురు పంపండి!

- టీచర్ పేరెంట్స్ సమావేశానికి హాజరుకాని తల్లితండ్రులకు మళ్లీ పిలుపు
- విద్యార్థులతో చెప్పి రప్పించాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆదేశాలు
- ప్రోగ్రెస్ కార్డు ఇచ్చి.. విద్యార్థుల ఆరోగ్య అంశాలు నమోదు చేయాలని సూచన

మండపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్స్ మీట్ (పీటీఎం) విజయవంతంగా జరిగిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా పిల్లల మార్కులతోపాటు వారి ఆరోగ్య వివరాలనూ తల్లిదండ్రులకు తెలియజేశారు. కానీ వివిధ కారణాలతో ఆరోజు సమావేశానికి కొందరు తల్లిదండ్రులు హాజరుకాలేదు. ఇలా హాజరుకాని తల్లిదండ్రులకు విద్యార్థుల ద్వారా కబురు పంపించి పాఠశాలకు పిలిపించి వారికి ప్రోగ్రెస్ కార్డు, విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తెలియపరచాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. అదేవిధంగా ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలు తప్పనిసరిగా హెల్త్‌కార్డులో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తాజాగా సూచించారు. పీటీఎం సమావేశం రోజున చాలా పాఠశాలల్లో 9, 10 తరగతి విద్యార్థులకు సంబంధించిన ఆరోగ్య వివరాలను మాత్రమే వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. మిగిలిన తరగతుల పిల్లల ఆరోగ్య విషయాలు నమోదు ఇంకా పూర్తికాలేదు. ఈనేపథ్యంలో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. దాంతో 9, 10 తరగతుల విద్యార్థులు మినహా మిగిలిన విద్యార్థుల వివరాలు ఇంకా హెల్త్‌కార్డులో పొందుపరచలేదని అధికారుల దృష్టికి వచ్చింది. వెంటనే ఆ విద్యార్థులు, వివరాలను హెల్త్‌కార్డులో నమోదు చేయించి వారి తల్లితండ్రులకు పిల్లల ఆరోగ్య సమాచారం తెలియపరచాలని హెచ్‌ఎంలను ప్రభుత్వం ఆదేశించింది.

ఆరోగ్య సమస్యలకు ఆదిలోనే చికిత్స

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో పిల్లలకు వైద్యపరీక్షలు చేసినా అవి చాలా పరిమితంగానే నిర్వహించారు. బాలికల్లో రక్తహీనత తెలుసుకోవడానికి ఎనీమియా పరీక్ష, బాలురకు గ్రహణంమొర్రి, చేతులు వంకరలు పోవడం వంటి వాటికి మాత్రమే పరీక్షలు నిర్వహించి, అందుకు సంబంధించిన వైద్య సేవలందించేవారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బాలబాలికలకు 22 రకాల వ్యాధులకు సంబంధించిన వైద్యపరీక్షలు చేయించేలా చర్యలు తీసుకోవడంతోపాటు పేరెంట్స్‌కు పిల్లల ఆరోగ్య వివరాలు తెలియజేసేలా చర్యలు చేపట్టారు. దీనివల్ల వెంటనే ఆయా వ్యాధులకు సంబంధించిన వైద్యసేవలు పొందేందుకు వీలుకలుగుతుంది. ఈరకమైన స్క్రీనింగ్ పరీక్ష వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇక గత శనివారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి అన్ని జిల్లాల్లో సగటున 70 శాతం మేర హాజరు ఉందని అధికారులు అంచనా వేశారు. మిగిలిన 30 శాతం మంది పేరెంట్స్‌ను కూడా రానున్న వారం పది రోజుల్లో పాఠశాలలకు పిలిపించి విద్యార్థి సమక్షంలో విద్యార్థికి ఇప్పటివరకు వచ్చిన మార్కులు, బడికి హాజరుతోపాటు పిల్లల క్రమశిక్షణ, ఇతర వ్యాపకాల గురించి తెలియపరచాలని ప్రభుత్వం ఆదేశించింది. దీన్ని అన్ని పాఠశాలల్లో ఆచరించి మీటింగ్‌కు హాజరుకాని ప్రతి పేరెంట్‌కు హోలిస్టిక్‌కార్డుతోపాటు హెల్త్‌కార్డును చూపించి వారి వద్ద నుంచి ధ్రువీకరణ సంతకం తీసుకోవాలని ఆదేశాలు అందాయి. ఇదిలా ఉండగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1567 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు లక్ష మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి గురువారం, శనివారం రెండు రోజులపాటు పాఠశాల సమీపంలో ఉన్న పీహెచ్‌సీ, ఇతర ఆసుపత్రి వైద్యులు వచ్చి 22 రకాలు వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్ చేస్తున్నారు.



మండపేట సంఘం కాలనీ ఎంపీపీ పాఠశాలలో పేరెంట్, టీచర్ మీట్‌లో సందడి (ఫైల్‌ఫొటో)

ఈ వివరాలను రాష్ట్రీయ బాల ఆరోగ్య సురక్ష జిల్లా అధికారులకు తొలుత వైద్యులు చెప్పి ఆ వివరాలను వైద్యరికార్డులో నమోదు చేస్తారు. పిల్లలకు దీర్ఘకాలిక వ్యాధులు ఏమైనా బయటపడితే వెంటనే జిల్లా ఆసుపత్రి లేదా బోధనాసుపత్రికి తల్లితండ్రులు తీసుకువెళ్లి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలి. ఎవరెవరికి ఏ ఆసుపత్రులకు పంపించిందనే వివరాలు పాఠశాల రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలి. ఏదైనా సమస్య వచ్చినపుడు ఈ రికార్డును ప్రమాణికంగా తీసుకుంటారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని పిల్లల హెల్త్ కార్డు వివరాలను ఎప్పటికపుడు అప్‌డేట్ చేసి ఉంచాల్సి ఉందని ఉపాధ్యాయవర్గాలు తెలిపాయి.

పీటీఎం స్పందన బాగుంది..

పేరెంట్, టీచర్స్ సమావేశాలకు వచ్చిన స్పందన చాలా బాగుందని పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెబుతున్నారు. తల్లిదండ్రుల హాజరుశాతం కూడా బాగుందని, వారి పిల్లల ప్రతిభా వివరాలతో పాటు ఆరోగ్య సమస్యల వివరాలు అడిగి తెలుసుకోవడానికి ఎంతో ఆసక్తి చూపారని ఉపాధ్యాయులు తెలియజేశారు. ఇలాంటి సమావేశాల వల్ల ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రుల మధ్య సంబంధాలు పెరిగి, నిత్య పర్యవేక్షణ ద్వారా విద్యార్థుల భవితకు దోహదం చేస్తాయని పలువురు పలువురు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

- గో వధను సంపూర్ణంగా నిషేధించాలి: భారతీయ ధర్మ పరిషత్
- జిల్లాలవారీగా గోవుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- దేశవ్యాప్తంగా సనాతన హైందవ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ ధర్మ పరిషత్ సభ్యులు

జగ్గంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణ కోసం స్వామీజీలు స్థానిక సోమాలమ్మ తల్లి ఆలయం వద్ద నుంచి లయన్స్ క్లబ్ వరకు పాద యాత్ర నిర్వహించారు. అనంతరం భారతీయ ధర్మ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర ఆధ్వర్యంలో జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. జాతీయ అధ్యక్షుడు కృష్ణచరనంద భారతీస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల వారీగా గోవుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటిస్తూ గో వధను సంపూర్ణంగా నిషేధించాలని కోరారు. దేశవ్యాప్తంగా సనాతన హైందవ దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలన్నారు. తిరుమలలో తక్షణం దేశవాళీ గోశాలలు, డెయిరీలు ఏర్పాటుచేసి స్వచ్ఛమైన నేతితో లడ్డూ ప్రసాదం శ్రీవారికి నైవేద్యంగా సమర్పించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకూ తిరుమల ప్రసాదం అందించే ఏర్పాటు చేయాలని త్వరలో టీటీడీ చైర్మన్‌ను కలిసి వినతిపత్రం అందిస్తామన్నారు. సమావేశంలో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ నాయకుడు తోట సర్వారాయుడు, భారతీయ ధర్మ పరిషత్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాదాచార్యులు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు అభినంద స్వామి, స్కంద దేవానందగిరి స్వాములు, మాతా విద్యనందగిరి పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో హీరో అల్లరి నరేష్ పూజలు

అన్నవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి సినీహీరో అల్లరి నరేష్ సోమవారం విచ్చేశారు. ఆయనకు ప్రొటోకాల్ అధికారులు కొండలరావు, గంటా విష్ణు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. నరేష్‌తో సెల్ఫీలు దిగేందుకు భక్తులు ఆసక్తి కనబర్చారు. పెద్దింటి తలుపులయ్య తదితరులు పాల్గొన్నారు.



సత్యదేవుడి దర్శనానంతరం సినీహీరో అల్లరి నరేష్

తలుపులమ్మ సేవలో 'బచ్చలమల్లి' సినిమా టీం

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునికి చెందిన డైరెక్టర్ సుబ్బు తెరకెక్కించిన బచ్చల మల్లి సినిమా టీం సోమవారం తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకుంది. ఈ నెల 20న విడుదల కానున్న ఈ చిత్రం విజయవంతం కావాలని అమ్మవారిని మొక్కుకున్నట్టు సినీ నిర్మాత రాజేష్ దండా తెలిపారు. నటుడు అల్లరి నరేష్‌ను చూసేందుకు వచ్చిన వారితో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది.



సినీ బృందాన్ని ఆశీర్వదిస్తున్న పండితులు

వినూత్నంగా 'బచ్చలమల్లి' సినిమా ప్రచారం

- తుని యువతతో క్రికెట్ ఆడిన సినిమా టీం
- విజేతలతో చిత్రంలోని ఒక పాట ఆవిష్కరణ
- ట్రాక్టర్ల పోటీలు నిర్వహించి బహుమతులు
- క్రికెట్ ఆడి మెప్పించిన హీరో అల్లరి నరేష్

తుని రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో బచ్చలమల్లి సినీ బృందం వినూత్న ప్రచారానికి తెరతీసింది. ఉదయం, మధ్యాహ్నం ట్రాక్టర్, క్రికెట్ పోటీలు నిర్వహించి సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేసింది. స్థానిక యువతతో సినీబృందం క్రికెట్ ఆడి విజేతలతో సినిమాలోని ఒక పాటను ఆవిష్కరింపజేశారు. ఈ చిత్ర హీరో అల్లరి నరేష్ బ్యాటింగ్ చేసి యువతతో కేరింతలు కొట్టించారు.

బచ్చలమల్లి చిత్ర బృందం సోమవారం తుని పట్టణంలో సందడి చేసింది. ఈ చిత్ర ప్రచారంలో భాగంగా తుని పట్టణానికి చెందిన టీంతో కలిసి క్రికెట్ ఆటాడింది. బచ్చలమల్లి మూవీ టీం ఏర్పాటు చేసిన ట్రాక్టర్ల పోటీ అభిమానులను ఆకట్టుకుంది. ఈ పోటీలు ముగిసిన తర్వాత సాయంత్రం తుని రాజా కళాశాల ప్రాంగణంలో సినిమా ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో బచ్చల మల్లి సినిమా నుంచి రచయిత పూర్ణాచారా రాసిన పాటను విజేతలైన తునికి చెందిన క్రికెట్ టీంతో ఆవిష్కరించారు. అనంతరం హీరో అల్లరి నరేష్ ట్రాక్టర్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఓ రైతుకు రూ.50వేల నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున తరలివచ్చిన అభిమానులను ఉద్దేశించి సినిమా హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ గోదావరి ప్రజల ఆత్మీయతా, అభిమానులు మరవలేనివన్నారు. తమ సినిమా అందరినీ ఆకట్టుకునేలా ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు అల్లరి నరేష్‌గా అభిమానిస్తున్న ప్రేక్షకులు ఈ సినిమాతో ఓ మంచి హీరో నరేష్‌గా తనను గుర్తిస్తారన్నారు. తుని ప్రాంతానికి చెందిన దర్శకుడు సుబ్బు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల నేపథ్య కథను ఎంపిక చేసుకుని తుని పరిసర ప్రాంతంతోపాటు గోదావరి జిల్లాల్లో ఎక్కువ శాతం షూటింగ్ చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను చూసి తనను ఆశీర్వదించాలని కోరారు. చిత్ర నిర్మాత రాజేష్ మాట్లాడుతూ సినిమా సూపర్ హిట్ కావడం ఖాయమని, పండుగ వాతావరణంలో సినిమా విజయోత్సవ వేడుక తునిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తుని పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులతోపాటు జగ్గంపేటకు చెందిన వీరాంజనేయ ఫిల్మ్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.





ట్రాక్టర్ల పోటీలో విజేతలకు చెక్ అందజేస్తున్న సినీ హీరో అల్లరి నరేష్, దర్శకుడు సుబ్బు

తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు

- తీవ్ర వాయుగుండం హెచ్చరికలతో తీరప్రాంతంలో మత్స్యకారుల అప్రమత్తం

కొత్తపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తాజాగా ఏర్పడిన తీవ్రవాయుగుండం హెచ్చరికలతో తీరప్రాంత ప్రజలు అప్రమత్తమయ్యారు. ఉప్పాడ-అమీనబాద్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న మినీ హార్బర్ సమీపంలో ఉన్న మాయాపట్నంలో గతంలో నిర్మించగా శిథిలమైన జియోట్యూబ్ టెక్నాలజీపైనుంచి సోమవారం అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ దగ్గర్లో ఉన్న పంటభూముల్లోకి దూసుకుపోతున్నాయి. ఉప్పాడ పాతబజారు, సూరాడపేట, రామిశెట్టిపేట, కొత్తపట్నంవద్ద రాకాసి అలలు మత్స్యకారుల ఇళ్లల్లోకి జొరబడుతున్నాయి. సుబ్బంపేట, విద్యుత్‌ప్లాంటు, బీచ్‌రోడ్డులో పెద్దవంతెన స్థానే నిర్మించిన అప్రోచ్ వంతెనపై నుంచి కెరటాలు ఎగసిపడుతున్నాయి. తీవ్రఅల్పపీడన హెచ్చరికలు జారీ చేయడంతో మత్స్యకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలకాలంలో రెండు, మూడు నెలల్లో సంభవించిన వరుస తుఫాన్లు, అల్పపీడనాలతో జీవనోపాధికి ఆటంకం ఏర్పడిందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



కొత్తపల్లి మండలం ఉప్పాడలోని మాయాపట్నంవద్ద జియోట్యూబ్ పైనుంచి పొలంలోకి చేరిన సముద్ర నీరు

తాడోపేడో తేల్చుకుంటాం

రాజమహేంద్రవరంలో ఎల్ఐసీ ఏజెంట్ల మహాధర్నా




మహాధర్నాలో ఐక్యత చాటుతున్న యూనియన్ నేతలు, ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాలసీదారులకు, ఏజెంట్లకు నష్టం కలిగించేవిధంగా నిర్ణయాలు తీసుకున్న జీవిత బీమా సంస్థ యాజమాన్య వైఖరిని నిరసిస్తూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడి ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద లియాఫి(అఖిల భారత జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య) ఆధ్వర్యంలో మహా ధర్నా చేశారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ఏజెంట్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. యూనియన్ రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు రావుల మాధవరావు మాట్లాడుతూ దేశంలో 14 లక్షల మంది ఏజెంట్ల మనుగడకు నష్టం కలిగించే విధంగా యాజమాన్యం ప్రవర్తించడం సరికాదన్నారు. పాలసీదారుల ప్రయోజనాలకు ఇబ్బందులు వస్తాయన్నారు. ఎల్ఐసీ సెప్టెంబరు 30 వరకు అమల్లో ఉన్న పాలసీలన్నింటిని క్లోజ్ చేసి అక్టోబరు 1 నుంచి కొత్త పాలసీలను ప్రవేశ పెట్టారని.. అందులో ఏజెంట్లకు, కస్టమర్లకు ఇబ్బంది కలిగించే విషయాలను పొందుపర్చడం జరిగిందన్నారు. క్లా బ్యాక్ కమిషన్ స్ట్రెక్చర్‌ని మార్చడం, మినిమం బీమా మొత్తం రూ.2 లక్షలకు పెంచడం, పాలసీల్లో వయోపరిమితిని తగ్గించడం, ప్రీమియం రేట్లు పెంచారని వాటన్నింటిని వ్యతిరేకిస్తున్నామన్నారు. తాడోపేడో తేల్చుకుంటామన్నారు. ఈసీ సభ్యుడు మస్తాన్ మాట్లాడుతూ తమ హక్కుల సాధనకు ఉద్యమిస్తున్నామని త్వరలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. మహాధర్నాలో వంగా త్రిమూర్తులు, దొరబాబు, సాంబ మూర్తి, పిండి రెడ్డమ్మ, అరవింద్, వేమూరి శ్రీనివాస్, వీఏఎస్ కృష్ణారావు, గండిబోయిన శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం, తణుకు, కొవ్వూరు, పాలకొల్లు, రావులపాలెం, అమలాపురం, రాజోలు, కాకినాడ, పెద్దాపురం, రామచంద్రపురం, రాజమహేంద్రవరం, జంగారెడ్డిగూడెం నుంచి 3వేల ఏజెంట్లు పాల్గొన్నారు.

బురదకోటలో పెద్ద పులి

» లేగదూడను చంపి తిన్న పులి
» పాదముద్రల గుర్తింపు..
నిర్ధారించిన అటవీ అధికారులు
» భయాందోళనలో గిరిజన గ్రామాలు




పెద్దపులి అడుగుజాడలు, పులి దాడిలో మృతిచెందిన లేగదూడ

ప్రత్తిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో 2 రోజులుగా పెద్ద పులి సంచరిస్తోంది. బురదకోట పంచాయతీ పరిధిలోని బాపన్నదొర అటవీప్రాంతంలో లేగదూడపై దాడి చేసి చంపి తినేసింది. అటవీశాఖ అధికారులు సోమవారం పెద్దపులి సంచారంపై గాలింపు జరిపి దాని పాదముద్రలు గుర్తించడంతో పులి రాకను నిర్ధారించారు. బురదకోట చుట్టుపక్కల గిరిజన గ్రామాలను అప్రమత్తం చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చి సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో పశువులు, మేకలను అటవీ ప్రాంతంలో మేపడానికి తరలించవద్దని ఆదేశాలు ఇచ్చారు. జిల్లా అటవీ అధికారి డి.రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ కె.దుర్గారాంప్రసాద్, డీఆర్వో ఎం. జాన్సన్, క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది పులి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బురదకోట, బాపన్నదొర, కె.మిర్రివాడ, కొండపల్లి, ఉలిగోగుల, అటవీ ప్రాంతంలో 6 ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేశారు. బురదకోట కేంద్రంగా రెండున్నర కిలోమీటర్ల దూరంలోని అటవీప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించామని ఫారెస్ట్ రేంజర్ కె.దుర్గారాంప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం నాటికి ట్రాప్ కెమెరాలకు పులి జాడ లభించలేదని చెప్పారు. పులి సంచరించిన ప్రదేశంలో పాదముద్రలను ల్యాబ్‌కు తరలించి అవి పులి పాదయాత్రలేనని నిర్ధారించడం జరిగిందని తెలిపారు. ఇది ఇలా ఉంటే బురద కోట అటవీ ప్రాంతంలో పులి సంచరించడం నిర్ధారణ కావడంతో ఒక్కసారిగా సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో భయాందోళన నెలకొన్నాయి. పశువులను, గొర్రెలను, మేకలను సమీప అడవుల్లోకి పంపవద్దని, ప్రజలు గుంపులు గుంపులుగా తిరగాలని, ఒంటరిగా ఎవరూ అటవీప్రాంతంలోకి వెళ్లవద్దని కరపత్రాలు ముద్రించి పంపిణీ చేశారు.

పులి ఎలా వచ్చింది?

బురద కోట అటవీప్రాంతానికి పులి రాకపై గిరిజనులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పాపికొండలు, రిజర్వ్ ఫారెస్ట్ నుంచి రాజవొమ్మంగి అటవీప్రాంతం గుండా ఏలేశ్వరం అటవీప్రాంతానికి చొరబడిందని పలువురు చెబుతున్నారు.



ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న ఫారెస్ట్ అధికారులు

శంఖారావ యుగళం దంపతులకు...

కామధేను జాతీయ పురస్కారం



హైదరాబాద్‌లో జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న నరసింహారావు దంపతులు

పి.గన్నవరం/రాజమహేంద్రవరం డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఓంకార ప్రణవనాదాన్ని ధ్వనిస్తూ...అఖండ శంఖారావాన్ని పూరించడంలో జాతీయస్థాయిలో ఖ్యాతిని ఆర్జించి అనేక రికార్డులను, అవార్డులను, సువర్ణ ఘంటా కంకణాలు సాధించి అఖండ శంఖారావ యుగళంగా పేరు సాధించిన ఏపి ప్రత్యేక రక్షణదళం ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరానికి చెందిన డాక్టర్ కొండా నరసిం హారావు, అలివేలు మంగాదేవి దంపతులు మరో జాతీయ పురస్కారాన్ని (విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ కామధేను జాతీయ పురస్కారం) అందుకున్నారు. ఈ మేరకు ఈనెల 8వ తేదీన తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక రంగం విభాగంలో ఆ సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత న్యాయస్థానం జస్టిస్ నందా చేతులు మీదుగా ఆ దంపతులు అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంఖంపై ఉన్న ఎనలేని మక్కువతో 38 ఏళ్లుగా సొంత ఖర్చులతో దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో 6 వేలకు పైగా కార్యక్రమాల్లో మేం శంఖారావం పూరించాం. జాతీయ పురస్కారాల అవార్డుల ప్రదానోత్సవం మా శంఖారావంతోనే ప్రారంభించడం సంతోషంగాఉంది అని పేర్కొన్నారు.



కార్యక్రమంలో శంఖాన్ని పూరిస్తున్న దృశ్యం

13 నుంచి నన్నయ వర్సిటీలో

అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో యూనివర్శిటీ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ కం విశ్వవిద్యాలయం జట్టు ఎంపికలు ఈనెల 13వ తేదీ నుంచి రెండురోజుల పాటు నిర్వహించనున్నట్టు ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్, క్రీడాబోర్డు కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ తెలిపారు. విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా ఈ పోటీలను క్యాంపస్‌లో నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉభయగోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల నుంచి దాదాపు 250 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్‌లలో 24 ఈవెంట్స్ మహిళలకు, పురుషులకు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఛైర్మన్ కొండ్రు సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి చొల్లంగి వెంకటసుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

తాండవలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణ శివారు రేఖవానిపాలెంలో కాలు జారి తాండవ నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం రెండు రోజుల తర్వాత కత్రావుల కొండ వద్ద పైకి తేలింది. మృతుడు రేఖవానిపాలెం గ్రామానికి చెందిన గెడ్డం సాయి (23)గా గుర్తించి తుని పట్టణ పోలీసులు శవ పంచనామాలు అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి భార్య, 3 నెలల బాబు, తల్లిదండ్రులు ఉన్నారు.

లైసెన్స్ లేకుండా రెస్టారెంట్

సీజ్ చేసిన అధికారులు

కపిలేశ్వరపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలో పంచాయతీ అనుమతి లేకుండా శ్రీ గణపతి రెస్టారెంట్ కొనసాగుతుంది. సోమవారం ఉదయం గ్రామస్తులు స్థానిక పంచాయతీ కార్యాలయానికి వెళ్లి రెస్టారెంటు నిర్వహణపై కార్యదర్శి కె.రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, వైద్యశాఖ అధికారులు సమక్షంలో రెస్టారెంట్‌ను తెరిపించి చూడగా ఫ్రిడ్జ్‌లో నిల్వ మాంసం, జాయింట్లు, బిర్యాని వంటిని ఉండటాన్ని గుర్తించారు. వాటిని బయటకుతీయించి నిర్వాహకుడు కె.గంగవరం మండలం ఎండగండికు చెందిన గంటి గణపతి నుంచి వివరాలు సేకరించారు. శ్యాంపిల్స్‌ను మెడికల్ సిబ్బంది సేకరించారు. అనంతరం నిల్వ ఉన్న మాంసం, బిర్యాని, తదితర వాటిని సిబ్బందితో భూమిలో పూడ్చిపెట్టారు. లైసెన్స్ లేని కారణంగా రెస్టారెంట్‌ను సీజ్ చేసినట్టు గ్రామ కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు.



టేకిలో రెస్టారెంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

కొలిమేరు టు కాకినాడ

● కదులుతున్న రేషన్ మాఫియా డొంక ● పట్టుబడిన 69 క్వింటాళ్లు ● పీడీఎస్ బియ్యం గుట్టురట్టు

తుని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం కొలిమేరుగ్రామంలో పెద్ద ఎత్తున పట్టుబడుతున్న పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా గుట్టు రట్టు అవుతుంది. 2రోజులు క్రితం పంట పొలాల్లో ఓ పౌల్ట్రీలో పెద్ద ఎత్తున పట్టుబడిన పీడీఎస్ డంప్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. సంబంధిత బియ్యం వివరాల కోసం ల్యాబ్‌కు తరలించగా కాకినాడ పోర్టు కేంద్రంగా విదేశాలకు అక్రమ రవాణా అవుతున్న బియ్యం, కొలిమేరులో పట్టుబడిన బియ్యం ఒకే రకానికి చెందినవిగా రిపోర్టులు రావడం సంచలనం రేకెత్తించింది. దీంతో రెవెన్యూ అధికారులు మరింత క్షుణ్ణంగా తనిఖీలు చేయగా కొలిమేరు గ్రామ శివారున ఓ వైసీపీ నాయకుడికి చెందిన రైస్ మిల్లులో పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టారు. దీంతో రైస్‌మిల్లులో తరలింపునకు సిద్ధంగా ఉన్న 69 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. సీజ్ చేసిన అధికారులు దీని వెనుక ఎవరు ఉన్నారనే కోణంలో ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మిల్లు నిర్వాహకులతో పాటుగా గొల్లప్రోలుకు చెందిన కొందరు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే రూరల్ పోలీస్‌స్టేషన్ కోళ్లఫారంలో పట్టుబడిన బియ్యానికి సంబంధించి గొల్లప్రోలుకు చెందిన ఒక వ్యక్తిపై కేసు నమోదైంది. దీని వెనుక ఎవరు ఉన్నారు?ఎంత కాలం నుంచి జరుగుతున్నదనే దానిపై వివరాలు సేకరిస్తున్నట్టు ఎంఎస్‌వో వి.రాజు చెప్పారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తాతారెడ్డి, వీఆర్వో తదితరులున్నారు.



కొలిమేరులో ఒక రైస్ మిల్లులో పట్టుబడిన పీడీఎస్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గురజనాపల్లిలో ఉమ్మడి జిల్లా రగ్బీ జట్ల ఎంపిక



ఎంపికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ బాలుర జట్టు



బాలికల జట్టు

కరప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి హైస్కూల్ క్రీడాప్రాంగణంలో సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా అండర్-15 సబ్‌జూనియర్ బాలురు, బాలికల రగ్బీ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. కరప, పిఠాపురం, కొమరగిరి, రామచంద్రపురం మండలాలకు చెందిన పలువురు క్రీడాకారులు ఈ ఎంపికల్లోపాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన బాలురు, బాలికలను ఎంపికచేసి ఉమ్మడి జిల్లా జట్ల వివరాలను వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15 నుంచి రెండు రోజుల బాటు గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని హెచ్ఎం ఎం.సాయి మోహన్, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నాగలింగేశ్వరరావులు తెలిపారు. ఆయా జట్లకు ఎంపికైన క్రీడాకారులను అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమిడిశెట్టి నాగేంద్ర, లక్ష్మణ్, ఇన్‌చార్జ్ హెచ్ఎం వీవీ రమణమూర్తి, పద్మ, శేషుకుమారి, బొండా సతీష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.


బాలుర జట్టుకు ఎంపికైనవారు

డి.విజయకుమార్, వైవీఎస్ మణిదీప్, పి.వినయ్‌లోకేష్, కె.నాగవిష్ణు, వి.హేమంత్, ఎ.క్రాంతి, జె.గౌతమ్‌అజయ్‌కృష్ణ, కేఎంఎస్ సాగర్, అభిరామ్, డి.విజయ్‌కుమార్, జె.ప్రేమ్‌కుమార్, కేపీ వరీషా, ఎ.గోవిందరాజు, జె.గౌతమ్.

బాలికల జట్టుకు ఎంపికైనవారు

వై.జ్యోతిచంద్రిక, ఎస్.వినీల, ఎన్.చాందిని, జి.తేజస్వీ, పి.వీరలత దివ్య, పి.శృతి, జి.మణిరాజేశ్వరి, టి.చంద్రకళ, కె.అమృత, పి.లోలాక్ష్యదేవి, డి.అలేఖ్య, ఎన్.దీపిక, కె.అఖిల, టి.వీరలక్ష్మి, పి.ని హారిక, బి.శిల్ప.

మహాసంస్థానంలో వైభవంగా లక్ష బిల్వార్చన




మహాసంస్థానంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న రుత్వికులు, పూజల అనంతరం ప్రత్యేక అలంకరణ

పిఠాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య రుత్విక్కుల బిల్వార్చన కార్యక్రమాలు జరిపించారు. అంతకుముందు మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్టానము, అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, వివిధ హారతులు. స్వామికి పల్లకిసేవ నిర్వహించారు. పూజాది కార్యక్రమాల్లో ఆలయ ఈవో ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పాదగయలో దత్త జయంతి మహోత్సవాలు ప్రారంభం

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభువమూర్తిగా వెలసిన దత్తాత్రేయస్వామి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతిపూజ, కలశస్థాపనలు, రుత్విక్ వరణములు, పంచామృతాభిషేక సహిత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పము, రుత్విక్కులచే దత్తమాల మంత్ర అనుష్ఠానం, గురుచరిత్ర పారాయణ, వేదపారాయణ, గణపతి అథర్వశీర్ష ఉపనిషత్ పారాయణ, విష్ణు, లలితా సహస్రనామ పారాయణలు జరిగాయి. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, దత్తమాల మంత్రహోమాదులు, సాయంత్రం సాయంకాల విశేష పుష్పార్చన, మంగళహారతి నిర్వహించారు. అనంతరం స్వయంభూ దత్తాత్రేయస్వామికి సహస్ర కలువ పుష్పార్చన నిర్వహించి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి భవితకు పునాది అభ్యాసనం దిశానిర్దేశం

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం

రాష్ట్ర కన్సల్టెంట్ బాలకృష్ణ

దివాన్‌చెరువు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి భవిష్యత్‌ను పునాది అభ్యాసనం దిశానిర్దేశం చేస్తుందని ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం రాష్ట్ర కన్సల్టెంట్ టి.బాలకృష్ణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరు సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) 4వ దశ ఆరు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ 2030 నాటికి సాధించాల్సిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నాణ్యమైన విద్యను సాధించాల్సి ఉందన్నారు. ఇదే విషయాన్ని నూతన జాతీయ విద్యావిధానం కుడా వివరిస్తుందన్నారు. పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం విద్యార్థి జీవితానికి బంగారు బాటలు వేస్తుందన్నారు. ప్రథమ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గీతారమ్య మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ముఖ్యంగా ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులన్నారు. శిక్షణా కార్యక్రమం కోఆర్డినేటర్, కోనసీమ జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మానటరింగ్ అధికారి పి.రాంబాబు మాట్లాడుతూ పునాది అభ్యసనం.. చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక నైపుణ్యాలను సూచిస్తుందని చెప్పారు. మూడేళ్ల నుంచి ఎనిమిది సంవత్సరాల వరకూ పాఠశాల విద్యావిధానంలో పునాదిస్థాయిగా పేర్కొన్నారు. నాలుగో బ్యాచ్‌లో కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 250 మంది ఉపాధ్యాయులు ఆరు రోజుల పాటు శిక్షణ పొందనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఎంఈవోలు సీహెచ్‌వీ సోమిరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి, కేఆర్పీలు ఈశ్వర్, కొండలరావు, గౌతమ్‌కృష్ణ ఎఫ్ఎల్ఎన్ ప్రాధాన్యతను వివరించారు. సమావేశంలో వెన్యూ ఆర్గనైజర్ పవన్, ప్రథమ్ కాకినాడ, కోనసీమ జిల్లా కోఆర్డినేటర్లు వంశీకృష్ణ, జీవన్, 17 మంది డీఆర్పీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

వాడపల్లిలో సినీనటుడు శుభలేఖ సుధాకర్ పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో సినీనటుడు శుభలేఖ సుధాకర్

ఆత్రేయపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం సినీనటుడు శుభలేఖ సుధాకర్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేద ఆశీర్వచనం అందుకున్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో సుధాకర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రూ.లక్ష విరాళం



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి బొమ్మూరుకు చెందిన ఎం.శివ, సత్యవతి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. వివిధ సేవల ద్వారా రూ.1,12,932 ఆదాయం లభించినట్టు ఉప కమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. హుండీలో సమర్పించిన కానుకల లెక్కింపు ఈనెల12తేదీన నిర్వహిస్తామన్నారు.

తిరునక్షత్ర ఉత్సవాలు ప్రారంభం



పల్లకీ మహోత్సవం



ఆళ్వార్‌కు అలంకరణ

ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న ఆళ్వార్ సన్నిధిలో తిరుమంగై యళ్వార్ తిరునక్షత్ర పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 5రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. తొలిరోజు ప్రకారోత్సవం, దవిడవేదపారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లునిర్వహించారు.

కొలిమేరులో టేకు దుంగలు పట్టివేత

తుని రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం కొలిమేరు గ్రామంలో సోమవారం ఓ వైసీపీ ప్రజా ప్రతినిధికి చెందిన పొలంలో పెద్ద ఎత్తున టేకు దుంగలు పట్టుబడ్డాయి. నిబంధనలకు విరుద్ధంగా టేకు చెట్లను నరికి దుంగలు దాచడంపై భూ యజమానిపై చర్యలు చేపట్టనున్నట్టు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.



పట్టుబడిన టేకు దుంగలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ బీట్ అధికారులు

జిల్లాలో ముమ్మిడివరం ప్రథమ స్థానం

ముమ్మిడివరం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): హౌస్ హోల్డ్ ఇమేజ్ క్యాప్చరింగ్ సర్వే, ఎస్సీసీఎల్ సర్వేలో జిల్లాలో ముమ్మిడివరం ప్రథమస్థానంలో నిలిచింది. హౌస్‌హోల్డ్ ఇమేజ్ క్యాప్చరింగ్, ఎస్సీసీఎల్ సర్వే నూరుశాతం పూర్తిచేసినట్టు ఎంపీడీవో తాడి శ్రీ వెంకటాచార్య తెలిపారు. సర్వేకు సహకరించిన కార్యదర్శులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య చర్యలు

ఉప్పలగుప్తం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్న సమాచారంతో భీమనపల్లి పంచాయతీ అప్రత్తమైంది. రాయుడుపాలెంలో పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావు, సామాజిక ఆరోగ్య విస్తరణాధికారి రాయుడు రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య చర్యలు చేపట్టారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనుల్లో డొల్లతనం

- తూర్పులంక ఓవర్‌హెడ్ ట్యాంకు లీకేజీ
- పనుల నాణ్యతపై ప్రజల ఆగ్రహం




తూర్పులంక వాటర్ ట్యాంకు పైభాగన లీకవుతున్న నీరు, అల్లవరం ఓవర్‌హెడ్ ట్యాంకుపై మొలిచిన మొక్కలు

అల్లవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా పథకం ద్వారా ప్రజలకు తాగునీరు అందించేందుకు లక్షలాది రూపాయలు ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఓవర్‌హెడ్ మంచినీటి ట్యాంకు పనుల్లో నాణ్యతా లోపాలు ఉన్నట్లు ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధుల ద్వారా అల్లవరం మండల పరిధిలో రూ.2కోట్లతో డి.రావులపాలెం, మొగళ్ళమూరు, గుండెపూడి, బెండమూర్లంక, దేవగుప్తం తదితర గ్రామాల్లో 8ఓవర్‌హెడ్ ట్యాంకులను గతంలో నిర్మించి ప్రారంభించారు. ప్రస్తుతం రూ.2కోట్ల ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో తూర్పులంక, గోడి, తుమ్మలపల్లి, కొమరగిరిపట్నం, యెంట్రుకోన, కోడూరుపాడు గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ఓహెచ్ఎస్ఆర్ మంచినీటి ట్యాంకు పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. తూర్పులంక ఉత్తర హరిజనపేటలో రూ.28 లక్షలతో ఈఏడాది జనవరిలో అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ శంకుస్థాపన చేశారు. తూర్పు లంకలోని ఈట్యాంకు ప్రారంభించకుండానే ట్రైయల్ రన్‌లో భాగంగా నీరు ఎక్కిస్తే లీకేజీలు బయట పడ్డాయి. గుండెపూడి ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు గట్టు దిగజారిన అధికారులు నేటికి పట్టించుకోలేదు. అల్లవరం మెయిన్‌లో గతంలో నిర్మించిన మంచినీటి ట్యాంకు పిల్లర్లు బీటలు తీసి ప్రమాదభరితంగా మారింది. ట్యాంకు పైభాగన మొక్కలు మొలిచి నిర్లక్ష్యాన్ని చూపుతున్నాయి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.స్వామిని వివరణ కోరగా తూర్పులంక ట్యాం కులోకి టెస్టింగ్‌గా నీరు ఎక్కించగా ఏర్పడ్డ లీకేజ్ సర్వసాధరణమే నన్నారు. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధుల ద్వారా పలు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నామని, ప్రతి ట్యాంకుకు మూడు సార్లు టెస్టింగ్ నిర్వహిస్తామన్నారు. ట్యాంకుల పనులు నాణ్యతతో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ముమ్మిడివరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయి భూసమస్యల పరిష్కారం కోసం మండలంలోని ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ ఎంవీఎస్ సుబ్బలక్ష్మి తెలిపారు. ఈనెల 10నుంచి 27వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. భూసమస్యలను ఆ సదస్సుల్లో పరిష్కరించుకోవాలన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో భూసమస్యల పరిష్కారానికి ఈనెల10 నుంచి వచ్చే ఏడాది జనవరి 3వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహశీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. భూఆక్రమణ సమస్యలను రెవెన్యూ అధికారులకు నివేదిస్తే, వాటిని నమోదు చేసి, షెడ్యూలు ప్రకారం సదస్సులు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

రాజోలు,(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాల్లో ఈనెల10 నుంచి జనవరి 2వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీల వద్ద ఉదయం 9గంటల నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. భూసమస్యలపై సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10న కూనవరం, 11న కాట్రేనిపాడు, 12న పొన్నమండ, 13 కడలి, 17న శివకోడు, 18న పొదలాడ, 19న సోంపల్లి, 20న రాజోలు, 21న తాటిపాక, 24న ములికిపల్లి, 27న చింతపల్లి, 28న బి.సావరం, జనవరి2న పాలగుమ్మి గ్రామపంచాయతీ వద్ద సదస్సులు నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో పంచాయతీల వద్ద సదస్సులు

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): ఈనెల10నుంచి 24వరకు మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సుల వివరాలను తహసీల్దార్ వాసా దివాకర్ తెలిపారు. 10న ఉప్పలగుప్తం, 11న టి.చల్లపల్లి, 12న భీమనపల్లి, 13న ఎస్.కొత్తపల్లి, 17న ఎస్.యానాం, 18న గొల్లవిల్లి, 19న మునిపల్లి, చినగాడవిల్లి, 20న సన్నవిల్లి, పెదగాడవిల్లి, గోపవరం, 21న కూనవరం, 24న విలసవిల్లి, నంగవరం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సదస్సులు జరుగుతాయన్నారు. ఈసదస్సుల్లో భూసమస్యలు పరిష్కరిస్తామన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి సఖినేటిపల్లి మండలంలో మంగళవారం నుంచి ఈనెల30వరకు అన్ని గ్రామ పంచాయతీల వద్ద రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. భూములకు సంబంధించి మార్పులు, చేర్పులు, భూవివాదాలు, భూ సర్వే తదితర విషయాలపై రైతులుదరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మంగళవారం నుంచి గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహశీల్దార్ ఆచార్యులు సూచించారు. మంగళవారం నుంచి ప్రతీ గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. సదస్సుల్లో భూసమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. 10న బి.దొడ్డవరం, 11న నగరం, 12న మామిడికుదరు, 13న ఆదుర్రు, 17న లూటుకుర్రు, 18న పాశర్లపూడి, 19న పెదపట్నం, 20న మొగలికుదురు, 21న ఈదరాడ, 24న మగటపల్లి, 26న గోగన్నమఠం, కరవాక, 27న అప్పనపల్లి, 28న పెదపట్నంలంక, 31న పాశర్లపూడిలంక, జనవరి 2న కొమరాడ, 3న మాకనపాలెం, 4న గెద్దాడ గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో సదస్సులు జరుగతాయన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): మంగళవారం నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. 10న వాడ్రేవుపల్లి, 11న మానేపల్లి, 12న నాగుల్లంక, 13న లంకలగన్నవరం, 16న మొండెపులంక, 17న బెల్లంపూడి, 18న పి.గన్నవరం, 19న ఉడిమూడి, 20న గంటిపెదపూడి, 21న కుందాలపల్లి, 23,27తేదీల్లో నరేంద్రపురం, 28న పోతవరం, 30న ముంగండ, జనవరి 2న కె.ముంజవరం, 3న ముంగండపాలెం, 4న కె.ఏనుగుపల్లి, 6న కఠార్లంక, 7న కారుపల్లిపాడు, 8న వై.కొత్తపల్లి గ్రామాల్లో పంచాయతీలు, సచివాలయాలు వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. భూసమస్యలను ఈసదస్సులు పరిష్కరించుకోవాలని తహశీల్దార్ సూచించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పీఎస్ఎస్ఎన్ శాస్త్రి

ముమ్మిడివరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్‌జీఆర్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్ శాస్త్రి డిమాండు చేశారు. ముమ్మిడివరం విశ్రాంత ఉద్యోగుల సమావేశ మందిరంలో సోమవారం యూనిట్ అధ్యక్షుడు రెడ్డి వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన మాట్లాడారు. 2018 నుంచి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్సీలో గ్రాడ్యుటీ రూ.12లక్షల నుంచి రూ.18లక్షలకు పెంచాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసి మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం స్పందించి వెంటనే నవంబరు నెల నుంచి సీపీపీని నిలుపుదల చేయడం పట్ల సమావేశం హర్షం వ్యక్తం చేసింది. సమావేశంలో యూనిట్ కార్యదర్శి పెద్దిరెడ్డి రామకృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పీవీవీ సత్యనారాయణరాజు, ఎం.ఆశీర్వాదం, జనిపల్లి సత్యనారాయణ, పేరి కామేశ్వరి, పల్లపు త్రిమూర్తులు, బీర కృష్ణమూర్తి, ఏవీవీ సత్యనారాయణ, సీహెచ్ వెంకట్రావు, వి.బాబాయ్, పీవీ సీతారామరాజు పాల్గొన్నారు.

ఆందోళన చెందవలసిన అవసరం లేదు: పౌరసరఫరాల శాఖ డీఎం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉప్పలగుప్తం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తేమ శాతంలో వ్యత్యాసం ఉన్నప్పటికీ రైతుల వద్ద నుంచి మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల డీఎం ఎం.బాల సరస్వతి హామీ ఇచ్చారు. మళ్లీ అన్నదాతల్లో ఆందోళన శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు డీఎం స్పందించారు. మిల్లుల వద్ద సమయం వృథా కాకుండా దిగుమతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని డీఎం అన్నారు.

తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీలోని కోళ్ల షెడ్డులోకి తాచుపాము చేరి హల్‌చల్ చేసింది. కోళ్లకు మేత వేయడానికి వెళ్లినవారు పామును చూసి భయభ్రాంతులకు గురయ్యారు. భూపతిరాజు తులసీకృష్ణ కుటుంబీకులు ఇచ్చిన సమాచారంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ చాకచక్యంగా తాచుపామును బంధించారు. పాము వయసు 25ఏళ్లు ఉంటుందని, దానిని అటవీ ప్రాంతంలో వదిలి వేయనున్నట్టు వర్మ తెలిపారు.

25 అర్జీల స్వీకరణ

అమలాపురం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ బి.కృష్ణారావు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 25 అర్జీలను స్వీకరించారు. ఆయా అర్జీల పరిష్కారానికి నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.



సొమ్ముల స్వాహాపై యానిమేటర్‌పై డ్వాక్రా సభ్యుల ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా సంఘ సభ్యులు

అంబాజీపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట యూనియన్ బ్యాంకు ద్వారా దీవెన డ్వాక్రా సంఘం తీసుకున్న రుణాన్ని తిరిగి బ్యాంకుకు చెల్లించాలని తాము ఇచ్చిన సొమ్ముతో యానిమేటర్ గౌరి పరారైందని గంగలకుర్రు గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూప్ సభ్యులు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో జరిగిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో మహిళలు తహశీల్దారుకు డ్వాక్రా యానిమేటర్‌పై ఫిర్యాదు అందించారు. యానిమేటర్ గౌరి, ఆమె భర్త ప్రభాకర్ తమ వద్ద బ్యాంకుకు చెల్లించాలని మా గ్రూపు వద్ద నుంచి రూ.2.50లక్షలకుపైగా తీసుకుని గ్రామం నుంచి పరారయ్యారని ఆ గ్రూపు సభ్యులు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని తహశీల్దారును కోరారు. దీంతో తహశీల్దారు జె.వెంకటేశ్వరి స్పందించి తక్షణమే పోలీసులు కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీచేశారు.

పెన్షన్ల వెరిఫికేషన్‌కు పైలెట్ ప్రాజెక్టుగా గోడి

అమలాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌దారుల వెరిఫికేషన్‌కు పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని అల్లవరం మండలం గోడిగ్రామాన్ని ఎంపిక చేసినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. గోడి గ్రామంలో 403మంది పెన్షన్‌దారులు ఉన్నారు. పరిశీలన కోసం పది బృందాలను ఏర్పాటుచేశారు. వెరిఫికేషన్ కోసం ఇతర మండలాల నుంచి ఈవోపీఆర్డీ డబ్ల్యుఈఏ ఒక బృందంగా పది టీమ్స్ ఎంపిక చేశామన్నారు. పెన్షన్ వెరిఫికేషన్ ఏవిధంగా చేయాలో శిక్షణ ఇచ్చామన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో డీఎల్డీవోలు త్రినాథరావు, రాజేశ్వరరావు, అల్లవరం ఎంపీడీవో కృష్ణమోహన్, డీపీఎం కేవీఎల్ అన్నపూర్ణ, పది మండలాల సిబ్బంది హాజరయ్యారు. మంగళవారం గోడిలో ఉదయం 8గంటల నుంచి ఫీల్డువెరిఫికేషన్ చేపట్టి సాయంత్రానికి పూర్తి చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ఇంజనీరింగ్ వర్కర్ల సమ్మె

అమలాపురంటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సమ్మెకు దిగారు. టెక్నికల్ అండ్ నాన్‌టెక్నికల్ సిబ్బందితో రూ.29,200, రూ.24,500 జీతంగా చెల్లించాలని, 15ఏళ్లు పైబడినకార్మికులను క్రమబద్ధీకరించాలని, రాష్ట్ర పండుగ రోజులను సెలవులుగా ప్రకటించాలి లేదా వేతన దినాలుగా ప్రకటించాలని డిమాండు చేశారు. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికునికి రూ.10లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీకనకముత్యాలమ్మవారికి వెండి ఖడ్గం బహూకరణ

అంతర్వేది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం, అంతర్వేది గ్రామాల్లో వెలసి ఉన్న శ్రీకనకముత్యాలమ్మవారికి కేశవదాసుపాలేనికి చెందిన మేడిది మోహన్‌మాష్టారు రూ.1.08లక్షల విలువైన వెండి ఖడ్గాన్ని బహూకరించారు. జనసేన నాయకుడు, చింతలమోరి సర్పంచ్ రాపాక రమేష్‌బాబు, దాత మోహన్ మాష్టారు ఖడ్గాన్ని అందజేశారు. తొలుత వెండి ఖడ్గానికి సంప్రోక్షణ, పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు ఉండపల్లి అంజి, యెనుముల తాతాజీ, జిల్లెల్ల రక్షక్, బాబినాయుడు, యెనుముల రమణ, చిట్టూరి కేశవ పాల్గొన్నారు.

ఘనంగా జాతర మహోత్సవాలు

అంతర్వేది, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం, అంతర్వేది సరిహద్దు ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీకనకముత్యాలమ్మ జాతర మహోత్సవాలు సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం వరకు అమ్మవారి గ్రామోత్సవాలు జరుగుతాయి. కనకముత్యాలమ్మవారి సేవా, పూజా కార్యక్రమాలు చేసుకుని సోమవారం రాత్రి అమ్మవారి జాతర, గరగ నృత్యాలు, గారడీవిద్యలు, తీన్మార్, బాణసంచా కాల్పులతో వైభవంగా జరిగింది. గురువారం గ్రామ ఆడపడుచులు, ఇరు గ్రామాల ప్రజలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారు.

ఎమ్మెల్యే కొండబాబు పూజలు

అంతర్వేది, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) సోమవారం దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ఎమ్మెల్సీ గోపిమూర్తి విజయం పట్ల సంబరాలు

అమలాపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ బలపరిచిన బొర్రా గోపిమూర్తి ఘన విజయం సాధించడం పట్ల యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో సంబరాలు నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ఎంటీవీఎస్ సుబ్బారావు, బి.చంద్రకళ, ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి పాల్గొన్నారు.



అమలాపురంలో యూటీఎఫ్ సంబరాలు

యూటీఎఫ్ శ్రేణుల హర్షం

పి.గన్నవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గోపిమూర్తి విజయం సాధించడంపై పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు డి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికి పంచారు. కార్యక్రమంలో డీఎస్వీ ప్రసాద్, జీవీఎస్ పద్మావతి, వరిగేటి రత్నం, పేర్రాజు, డీవీఎస్ఎస్ఎన్ రాజు, జి.సుదర్శిని, బి.ఇందిర, మట్టపర్తి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల సంబరాలు

అయినవిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి అఖండ మెజార్టీ సాధించడంతో యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ముక్తేశ్వరంసెంటర్‌లో విజయోత్సవ ర్యాలీనిర్వహించారు.బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. జిల్లా కార్య దర్శి పి.మురుగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పీఎస్ నాగేంద్రరావు, గౌరవాధ్యక్షుడు జి.సాయిశ్రీనివాస్, అధ్యక్షుడు టీబీ ఈశ్వరరావు, కోశాధికారి ఎం.కిరణ్‌బాబు, టీచర్లు పాల్గొన్నారు.

మహాపుష్ప యాగం

అమలాపురంరూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి):బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా 11రకాల పరిమళ పుష్పాలతో శ్రీమహాపుష్పయాగం నిర్వహించారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



మామిడికుదురు: నగరంలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు

అమలాపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో స్థానిక వింటేజ్ హాలులో సోమవారం నిర్వహించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వంటెద్దు బాబి, యార్లగడ్డ రవీంద్ర, మహబూబ్ షకీలా, పేరి శర్మ, జోగి అర్జునరావు, వస్కా బాబు, పులుసుగంటి ప్రకాష్, అయితాబత్తుల కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కాంగ్రెస్ వేడుకలు

మామిడికుదురు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యురాలు, ఏసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నగరంలో సోమవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు కేక్ కట్‌చేసి అందరికీ స్వీట్లు, కేక్‌ను పంచారు. కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ, సీనియర్ నాయకుడు మహ్మద్ ఆరీఫ్, దోనిపాటి విజయలక్ష్మి, వానరాశి దొరబాబు, కొండేటి స్టాలిన్‌బాబు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

అమలాపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను చిన్న చూపు చూడకుండా ప్రోత్సహిస్తే వారు అన్ని రంగాల్లోను రాణిస్తారని అమలాపురం ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం బండారులంక భవిత కేంద్రం వద్ద దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. హైస్కూలు హెచ్ఎం ఎస్ఎల్వీ బాల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీవైఈవో ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ రామలక్ష్మి, ఎం.కామేశ్వరి, ఐఈఆర్పీలు ఎం.శ్రీనివాసరావు, జి.నానాజీ, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నడక నానీల కవితా సంపుటి ఆవిష్కరణ

అమలాపురం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నడక కవి నల్లా నరసింహమూర్తి రచించిన 111వ నడక నానీల కవితా సంపుటి (నడక నాతల్లిని) అంతర్జాతీయ వాకర్స్ చీఫ్ కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. నడిపూడి వాకర్స్ లాఫింగ్ ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన లాఫింగ్ క్లబ్ సమావేశంలో నానీల కవితా సంపుటిని ఆవిష్కరించారు. సాపే బాలరవి, కడలి సత్యనారాయణ, పెనుమాల చిట్టిబాబు, గెడ్డం భాస్కరరావు, కాశి వెంకట్రావు, దేవరపల్లి మోహనరావు, భయ్యా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కౌశల్-2024 పోటీలకు విద్యార్థుల ఎంపిక

అమలాపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో ఈనెల 6వ తేదీన కౌశల్-2024 పోటీలను నిర్వహించగా విజేతల వివరాలను సోమవారం రాత్రి జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా విడుదల చేశారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచినవారు ఈనెల 29,30 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి ప్రతిభాన్వేషణ పరీక్షకు ఎంపికైన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందిస్తూ త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటేలా ప్రత్యేకశిక్షణ ఇవ్వాలని సూచించారు. కౌశల్-2024 జిల్లా స్థాయి పోటీ పరీక్షల్లో 8వ తరగతి నుంచి క్విజ్‌లో ఎం.వెంకటరమణ (మురమళ్ల జడ్పీహెచ్ఎస్) ప్రథమ, అంకసానిచెరువు పాఠశాల విద్యార్థి ఉంగరాల వశిష్ఠనాగసాయిప్రజ్ఞ ద్వితీయ, పోస్టర్ ప్రజెంటేషన్‌లో జక్కంపూడి తులసీచందు (కొంకాపల్లి), ప్రథమ, నవరపు రష్మిత (గొల్లవిల్లి జడ్పీహెచ్ఎస్) ద్వితీయ స్థానాలు సాధించారు. 9వ తరగతిలో క్విజ్‌లో దూడల హాసిని (కొంకాపల్లి) ప్రథమ, పి.శ్రీరమ్య (జి.పల్లిపాలెం జడ్పీహెచ్ఎస్) ద్వితీయ, పోస్టర్ ప్రజెంటేషన్‌లో పి.లక్ష్మీశ్రీ (జి.పల్లిపాలెం జడ్పీహెచ్ఎస్) ప్రథమ, ఆర్.కీర్తి (అమలాపురం బాలికల జడ్పీహెచ్ఎస్) ద్వితీయ స్థానాలు సాధించారు. 10వ తరగతిలో క్విజ్‌లో పడాల లోకేశ్వర్‌రెడ్డి (మాచవరం జడ్పీహెచ్ఎస్) ప్రథమ, ఒగ్గు కుశ్వంత్‌సాయి (మాచవరం జడ్పీహెచ్ఎస్) ద్వితీయస్థానాలు సాధించారు. లఘు చిత్రాల విభాగంలో కారెం రేష్మశ్రీ (కొంకాపల్లి) ప్రథమ, సుతాపల్లి దేవహర్షనాగశ్రీసందీప్ (రామచంద్రపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు డీఈవో ప్రకటించారు.

'ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర'

అయినవిల్లి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర అని, దళితుల మధ్య చిచ్చుపెట్టి అగ్రకుల పార్టీలు కుట్ర చేస్తున్నాయని రాక్స్ జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. కొంకి వెంకట్రావు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సిరిపల్లిలో బొక్కా రామచంద్రరావు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా భారీ బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభను జయప్రదం చేయాలని కోరారు. కాశి వీరవెంకటసత్యనారాయణ, వారా లక్ష్మీనరసింహరామ్, కుంచే చంద్రకాంతుడు, జిత్తుక సత్యనారాయణ, గుర్రాల రాంబాబు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను చూడాలి

అంతర్వేది, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో రామేశ్వరం గ్రామంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖినేటిపల్లి ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ పర్యవేక్షణలో మండలాధికారులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సఖినేటిపల్లి మండలంలో గంజాయి మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాల విషయంలో ఏవిధమైన సమాచారం ఇచ్చినా వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎఫ్ఏసీ కె.సూర్యనారాయణ, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మలికిపురం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్, మత్తుపదార్థాలకు బానిసలు కాకుండా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మలికిపురం ఎస్ఐ పి.సురేష్ అన్నారు. సోమవారం లక్కవరం మంగెన గుర్రయ్య కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా యువతకు అవగాహన కల్పించారు.ఎంపీపీ ఎంవీ సత్యవాణి, సర్పంచ్‌లు కోట పుష్పకుమారి, బోనం సీతారత్నం, ఆరేటి రంగనాయకులు, కొల్లు నరసింహస్వామి, కరస్పాండెంట్ మంగెన సత్యప్రసాద్, ఏబీ నాయుడు, కె.అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదుకోవాలని వరి చేలలో రైతుల నిరసన



బెండమూర్లంకలో నీటిలో ఉన్న వరి చేలలో రైతుల నిరసన

అల్లవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పండిన చేలు కోతకు దశకు రాగా ఇటీవల ఏర్పడిన తుఫాన్, వర్షాలకు నేలన్నంటి నష్టపోతున్న తమను ఆదుకోవాలని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బెండమూర్లంకలో పడిపోయిన వరి చేలలో రైతులు దిగి నిరసన వ్యక్తం చేశారు. పంటనష్టాల నమోదు జరగడం లేదని, వచ్చే సోమవారం జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్నామన్నారు. నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గిడుగు భాస్కరరావు, మండేలా సూర్యభగవాన్, పెచ్చెట్టి సత్యనారాయణ, గుర్రం నాగేశ్వరరావు, పితాని వరలక్ష్మి, గుర్రం వెంకటకృష్ణ, పితాని నరసింహమూర్తితో పాటు పలువురు రైతులు నిరసన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ముమ్మిడివరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు అధ్యక్షతన సోమవారం కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్‌ను నియమించారు. ముమ్మిడివరం నియోజకవర్గం కన్వీనర్‌గా నియమితులైన పాలెపు ధర్మారావు నియామక పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ముమ్మిడివరం మండల అధ్యక్షుడిగా దివి వెంకన్నబాబు, కాట్రేనికోన మండలాధ్యక్షుడిగా అయితాబత్తుల పండుబాబు, ఐ.పోలవరం అధ్యక్షుడిగా చిట్టిబాబు, తాళ్లరేవు మండలాధ్యక్షుడిగా దుర్గాప్రసాద్‌లకు నియామక పత్రాలు అందించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి అప్పగించిన బాధ్యతలను త్రికరణశుద్ధితో అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పెన్మెత్స జగ్గప్పరాజు, కంచుస్తంభం సోనీలతో పాటు పలువురు ఉన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పండుబాబు

కాట్రేనికోన, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా రెండో సారి అయితాబత్తుల పండుబాబును నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గ కన్వీనర్ పాలెపు ధర్మారావుకు పండుబాబు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పురోభివృద్ధికి కృషిచేస్తానని ఆయన అన్నారు.

శ్రీశైలానికి సైకిళ్లపై యాత్ర

మలికిపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మోరి శివాలయంలో శివ దీక్ష తీసుకున్న అంకం శేషు, లక్కింశెట్టి గణేష్, జవ్వాది ఈశ్వర్‌లు దీక్షా కాలం ముగియడంతో ఇరుముడులు కట్టించుకుని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి సోమవారం సైకిళ్లపై యాత్రకు బయలుదేరారు. వీరికి పలువురు శివస్వాములు తోడుగా ఉండి సాగనంపారు. మూడు రోజుల్లో శ్రీశైలం చేరుకుంటామన్నారు.

ఆబోతుకు అంత్యక్రియలు

ముమ్మిడివరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ 13వవార్డు మహిపాలచెరువు సమీపంలో 216 జాతీయ రహదారిపై ఆబోతును గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందింది. ఆ వార్డుకు చెందిన శీలం పండు సహకారంతో జేసీబీ, మున్సిపాలిటీ ట్రాక్టరు సాయంతో ఆబోతును శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళ అదృశ్యం

ముమ్మిడివరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ రాయుడువారిపాలేనికి చెందిన బొక్కా విజయరాజు తల్లి వెంకటరమణ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని విజయరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇసుక తవ్వకాలపై ఫిర్యాదు

మామిడికుదురు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారంటూ స్థానికులు సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు, మామిడికుదురు తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచార్యులకు వేర్వేరుగా ఫిర్యాదులు అందించారు. బోడసకుర్రు వంతెన, రైలు వంతెన నిమిత్తం ఏర్పాటు చేస్తున్న పిల్లర్లకు దగ్గరలో ఇసుక తవ్వకాలు చేయరాదని జీవో ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వేగి లక్ష్మీనారాయణ, పోతుమూడి నానాజీ, బొక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

అల్లవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అమలాపురం మండలం పేరూరు తలుపుల తోటకు చెందిన అంబటి రాజు(22) బోడసకుర్రు- పాశర్లపూడి వంతెనపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతదేహాన్ని సోమవారం వైనతేయ గోదావరి నదీ నుంచి వెలికితీశారు. సీలింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాజు ఆదివారం రాత్రి మోటార్‌సైకిల్‌పై బయటకు వెళ్లినట్లు సమాచారం. ప్రేమవైఫల్యం వల్లే రాజు గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానిస్తున్నారు. ప్రమాదవశాత్తు తన కుమారుడు రాజు జారిపడ్డాడని అతని తండ్రి పాపారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

భవిత సెంటర్‌లో దివ్యాంగుల దినోత్సవం

ఉప్పలగుప్తం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. సాంస్కృతిక, క్రీడా పోటీల్లో విజేతలైన దివ్యాంగ చిన్నారులు, తల్లిదండ్రులకు బహుమతులందించారు. సీడబ్ల్యూఎస్ఎన్ స్నేహపూర్వక పాఠశాలలకు జ్ఞాపికలు బహూకరించారు. సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ, హెచ్ఎంలు లంక రాణి, సత్యనారాయణ, ఎల్.అమ్మాజీ, శ్యామల, ఐఈఆర్టీలు చిక్కం గంగాదేవి, పి.వెంకటేష్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పి.గన్నవరం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా 37మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 12మందిని హైరిస్క్‌గా గుర్తించి స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. వేణి ఫౌండేషన్ ఛైర్మన్ నల్లా గంగాఈశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహారాన్ని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి గర్భిణులకు అందించారు. సర్పంచ్ బొండాడ నాగమణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, హెడ్‌నర్సు కుమారి, నల్లా పెద్దకాపు పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



జొన్నాడ-మండపేట రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

జొన్నాడ-మండపేట రోడ్డుకు నిధులు మంజూరు

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆలమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడ నుంచి మండపేట వెళ్లే ఆర్అండ్బి రోడ్డుకు రూ.కోటి 30 లక్షల నిధులు మంజూరైనట్టు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. కొత్తూరు నుంచి వెదురుమూడి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరవగా, టెండర్ కూడా ఖరారైందన్నారు. త్వరలో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. అధ్వాన రోడ్లతో ప్రజల పడుతున్న ఇబ్బందులను గుర్తించి నిధులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే కృషి కూటమి నాయకులు, ప్రజలు అభినందిస్తున్నారు.

పసలపూడి పంచాయతీలో అధికారుల విచారణ



ఫిర్యాదుదారుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

రాయవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరపాలని గ్రామానికి చెందిన చింతా తమ్మిరెడ్డి ఫిర్యాదుపై సోమవారం అధికారుల బృందం విచారణ జరిపారు. పంచాయతీలో 2014 నుంచి నిధులు దుర్వినియోగం జరిగిందంటూ దీనిపై విచారణ జరపాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఏడాది జూన్ 18న జిల్లా పంచాయతీ అధికారి పసలపూడి పంచాయతీలో రికార్డులు పరిశీలించి తమ్మిరెడ్డి నుంచి వివరాలు తెలుసుకుని విచారణ నిమిత్తం ఒక కమిటీ వేయనున్నట్టు ఫిర్యాదుదారుడికి చెప్పారు. ఈ వ్యవహారంపై పంచాయతీలో ఎటువంటి విచారణ చేపట్టలేదని మరోసారి తమ్మిరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం మండపేట ఈవోపీఆర్డీ డి.శ్రీనివాస్, ఇద్దరు కార్యదర్శుల బృందం పంచాయతీలో విచారణ జరిపారు. ఫిర్యాదుదారుడి నుంచి పలు వివరాలు తెలుసుకున్నారు.

ద్వారపూడి గ్రామ సమస్యలపై జేసీకి ఫిర్యాదు



జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కూటమి నాయకులు

మండపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి సమస్యలపై గ్రామానికి చెందిన కూటమి నాయకులు సోమవారం అమలాపురం గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీటి వివరాలను వారు విలేకరులకు తెలిపారు. జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతా దొరబాబు, బీజేపీ నియోజకవర్గ నాయకుడు టంకశాల మురళీకృష్ణ తదితరులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. పేపరు మిల్లు నుంచి వచ్చే వ్యర్థాల వల్ల గ్రామంలో తాగునీటి జలాలు కాలుష్యం అవుతున్నాయని ఫిర్యాదులో తెలిపారు. పలు పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థాల వల్ల ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఫిర్యాదులో తెలిపామన్నారు. ద్వారపూడి నుంచి రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి, ద్వారపూడి నుంచి అమలాపురానికి ఆర్టీసీ సర్వీసులు నడపాలని కోరామన్నారు. కాలుష్యానికి కారణమవుతున్న పలు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరినట్టు వారు తెలిపారు.

శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణాలు

కె.గంగవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రాష్ట్ర రహదారులతో పాటు గ్రామాల్లోని రహదారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. దీంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె పండుగ ఏర్పాటు చేసి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్‌లు వంటి మౌలిక సదుపాయా లను సమకూర్చుతోంది. దీనిలో భాగంగా పామర్రు గ్రామంలో నిర్మిస్తున్న రెండు సీసీ రోడ్ల పనులు వేగంగా సాగుతున్నాయి. సోమవారం కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, దేవరపల్లి బుల్లి, నున్న వినయ్ వీటి పనులు పర్యవేక్షించారు. నాణ్యతతో రోడ్ల నిర్మాణాలు చేయాలని కాంట్రాక్టరుకు వారు సూచించారు.



రోడ్డు పనులు పరిశీలిస్తున్న కూటమి నాయకులు

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

రాయవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహశీల్దారు ఐపీ శెట్టి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం లొల్ల, 11న చెల్లూరు, 12న నదురుబాద, 13న సోమేశ్వరం, 16న కురకాళ్లపల్లి, 17న మాచవరం, 18న పసలపూడి, 19న వెంటూరు, 20న వెదురుపాక, 21న కూర్మాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు.

కె.గంగవరం: మండలంలో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ బండి మృత్యుంజయరావు తెలిపారు. మంగళవారం విలాస గంగవరం, అద్దంపల్లి, 11న యండగండి, పామర్రు, 12న గుడిగళ్ల, శివల, 13న సుందరపల్లి, తామరపల్లి, 16న దంగేరు, 17న ఊడిమూడి, కోటిపల్లి, 18న యర్రపోతవరం, బాలాంత్రం, 19న కె.గంగవరం, 20న కూళ్ల, సత్యవాడ, 21న పాణింగపల్లి, అముజూరు, 23న పేకేరు, తాళ్ళపోడు, 26న కుడుపూరు, కుందూరు, 27న కోట, 28న భట్లపాలిక, 30న మసకపల్లి, జనవరి 2న శేరిలంక గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

కపిలేశ్వరపురం: మండలంలోని సచివాలయాల వద్ద మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ పి. చిన్నారావు తెలిపారు. రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌ను సోమవారం ఆయన తెలిపారు. నేడు టేకి, 11న వల్లూరు, 12న నేలటూరు, 13న కాలేరు, 16న నిడసనమెట్ట, వడ్లమూరు, 18న వెదురుమూడి, నల్లూరు, 19న వాకతిప్ప, 20న అంగర, 21న కోరుమిల్లి, 23న కపిలేశ్వరపురం, 24న తాతపూడి, 26న మాచర, 27న పడమరఖండ్రిక, 28న అద్దంకివారిలంక, కేదార్లంక గ్రామాల్లోని ఆయా సచివాలయాల వద్ద రెవెన్యూ సదస్సు జరుగుతాయన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఇంటి రుణాలకు దరఖాస్తు చేసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సొంత ఇంటి స్థలం లేదా ప్రభుత్వం ఇచ్చిన స్థలం ఉన్న అర్హత కలిగిన వారంతా గృహ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. అర్బన్ గృహ నిర్మాణ శాఖ ఏఈ పీవీవీఎస్ మూర్తి, టీపీఎస్ ఎ.శ్రీధర్, మున్సిపల్ ఏఈ పవన్‌కుమార్‌తో ఆయన కేంద్రం అందించే పీఎం ఆవాస్ యోజన పథకం-2పై సమీక్ష చేశారు. సొంతింటిని నిర్మించుకునే వారు వార్డు సచివాలయాల్లో ఇంటి స్థలం డాక్యుమెంట్, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ అందజేయాలన్నారు. దరఖాస్తుదారులు ఈనెల 15లోగా తమ దరఖాస్తులను అందించి ప్రభుత్వం అందించే రూ.2.5 లక్షల గృహ రుణం పొందాలని ఆయన తెలిపారు.

వెంకన్న సేవలు ప్రశంసనీయం



వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలకు జుత్తుగ వెంకన్న అందించిన సేవలు ప్రశంసనీయమని వక్తలన్నారు. సోమవారం కపిలేశ్వరపురంలో ఆయన వర్ధంతి సందర్భంగా జుత్తుగ వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు జుత్తుగ మల్లిఖార్జునుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతిలో పలువురు మాట్లాడారు. ముఖ్య అతిధులుగా సర్పంచ్ సాకా శ్రీనివాస్, జుత్తుగ చినవీర్రాజు, పెద్దింశెట్టి లెనిన్‌బాబు తదితరులు మాట్లాడారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిత కేంద్రంలోని చిన్నారులకు విద్య ఉపకరణాలు, పండ్లు, భోజన సదుపాయం కల్పించారు. మాచరమట్లలు గ్రామంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, అంగర పీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందించారు. కార్యక్రమంలో కమ్మ వెంకట్రావు, బలుసుజానకిరామయ్య, కట్టా మురళి, ఎంపీటీసీ సోనియా, తదితరులు, జుత్తుగ వెంకన్న కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చినుకుపడితే..చెరువే

• కొద్దిపాటి వర్షాలకే కాలనీలు జలమయం • పట్టించుకోని యంత్రాంగం



వాడపల్లి దుర్గమ్మ గుడి వద్ద ముంపునకు గురైన దృశ్యం

ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో చినుకుపడితే పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. తరచూ ముంపుబారిన పడుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు వెళ్లే దారిలేక ఈ పరిస్థితి తలెత్తుతోందని స్థానికులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షాలకే వాడపల్లి గ్రామంలోని రహదారులు జలమవుతున్నాయి. ముంపునీరు ముందుకు వెళ్లేందుకు అవుట్‌లెట్ లేకపోవడంతో తరచూ గ్రామం జలమయమవుతోంది. ఆత్రేయపురం పోస్టాఫీస్ వీధి, బండారు కాలనీలకు వెళ్లే రహదారులు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కొద్దిపాటి వర్షాలకు రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తరచూ ముంపునకు గురవుతున్న ఆయా ప్రాంతాల్లో ముంపు నీరు మళ్లించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆత్రేయపురం బండారుకాలనీలో ముంపునకు గురైన ప్రాంతం



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఆర్డీఖాన్

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై అసభ్యకర పోస్టులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆర్.డి.ఖాన్ సోమవారం రామచంద్రపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె వ్యక్తిగత జీవితంపై లేనిపోనివి ఆపాదిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తు చేసుకోండి



సీనియర్ జడ్జి రమణారెడ్డి

కొత్తపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్ నియామకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సీనియర్ జడ్జి పి.రమణారెడ్డి కోరారు. కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, పి.గన్నవరం మండలాల నుంచి ఆయా మండల లీగల్ సర్వీసెస్‌కు సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 15లోపు మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి దరఖాస్తులు అందచేయాలని తెలిపారు.

బాలింతలు, గర్భిణులకు రొట్టెలు, పాలు పంపిణీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో సోమవారం పోలిశెట్టి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ప్రతినెలా 9న గర్భిణి, బాలింతలకు ప్రధానమంత్రి మాతృ సురక్ష యోజనలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనికి వచ్చే గర్భిణులు, బాలింతలకు వారు పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, న్యాయవాది పోలిశెట్టి శ్రీనివాస్, జనసేన పట్టణ అధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లు, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ప్రవీణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



అంగరలో గర్భిణులకు పండ్లు అందిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : అంగర పీహెచ్‌సీలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 23 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు జరిపారు. వీరిలో ముగ్గురిని క్లిష్టతర గర్భిణులుగా గుర్తించి ప్రత్యేక వైద్య సదుపాయం అందించారు. గర్భిణులకు ఉచితంగా రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రత్నకుమారి పలు సూచనలు చేశారు. అనంతరం జుత్తుగ వెంకన్న వర్ధంతిని పురస్కరించుకుని వెంకన్న చారిటబుల్ ట్రస్ట్(మాచరమట్ల) నిర్వాహకులు జె.మల్లిఖార్జునుడు గర్భిణులకు వేరుశెనగ, చిక్కి, కమల, రేగుపండ్లను అందించారు. కార్యక్రమంలో హెచ్ఈ రామారావు, స్టాఫ్‌నర్సు బంగారు పాప, ఎన్ఎల్‌హెచ్‌పీలు ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పేరవరంలో విచారణ జరుపుతున్న డీఎస్పీ గోవిందరావు

ఇరువర్గాల ఘర్షణపై డీఎస్పీ విచారణ

ఆత్రేయపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామంలో ఇటీవల సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకల్లో రెండు సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు ఘర్షణకు పాల్పడి పరస్పరం దాడులకు దిగిన సంగతి తెలిసిందే. దీంతో శాంతి కమిటీని ఏర్పాటు చేసి సమస్యను సర్దుమణిగే చర్యలు చేపట్టారు. ఇరువర్గాల ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేయగా, గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. సోమవారం కొత్తపేట డీఎస్పీ వై. గోవిందరావు గ్రామంలో పర్యటించి ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలను విచారించారు. ఆయన వెంట రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము ఉన్నారు.

మున్సిపల్ పర్మినెంట్ కాంట్రాక్టు వర్కర్స్ ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధనకు సోమవారం మున్సిపల్ పర్మినెంట్ కాంట్రాక్టు వర్కర్లు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా జరిపారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని వారు నినాదాలు చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బండి సత్యనారాయణ, కార్యదర్శి గొర్రుపోతురాజు, ఏఐటీయూసీ నాయకులు పెద్దిరెడ్డి రాము, మాచరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమ్మె

ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం రామచంద్రపురంలో ఇంజనీరింగ్ వర్కర్స్ సమ్మె చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, లేనిపక్షంలో సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఎస్ శ్రీనివాస్, ఎం.నాగార్జున, వి.శ్రీనివాస్, వి.ప్రసాద్, కె.విశ్వనాథం, కలిదిండి అనిల్, ఎం.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ పర్మినెంట్ కాంట్రాక్టు వర్కర్లు

మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



మున్సిపల్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

మండపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయాల్లో ఒప్పంద వేతనంపై పనిచేసే కార్మికులు రోడ్కెక్కారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తమ న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు, ఉద్యోగులు సుబ్బారావు, లీలాకృష్ణ, తాతారావు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో జొన్నాడ విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిలకలూరుపేటలో జరిగిన కరాటే పోటీల్లో జొన్నాడ కరాటే స్కూల్ విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో బహుమతులు గెలుచుకున్నారు. చిలుకలూరిపేట న్యూ షావులిన్ కుంగ్‌ఫూ అకాడమి అధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జొన్నాడ వారియర్ మంక్స్ కుంగ్‌ఫూ విద్యార్థులు గెలుపొందిన వివరాలను కరాటే మాస్టర్ కె.సత్తిబాబు తెలిపారు. గరల్స్ విభాగంలో వైట్‌బెల్ట్‌లో మేడపాటి మనస్వి రెడ్డి గోల్డ్ మెడల్, ఎల్లోబెల్ట్ విభాగంలో మేడపాటి గీతికరెడ్డి, బాయ్స్ విభాగంలో జూనియర్ ఎల్లో బెల్ట్‌లో వెన్నేటి కిరణ్ సంపత్ గోల్డ్ మెడల్, ఆరెంజ్ విభాగంలో సుప్రజసాయి లక్కీ గోల్డ్ మెడల్ సాధించినట్టు తెలిపారు. జాతీయ స్థాయిలో పోటీల్లో విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులను పలువురు నాయకులు అభినందించారు.



బహుమతులు అందిస్తున్న దృశ్యం

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



కె.గంగవరంలో పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దాతలు

కపిలేశ్వరపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో దివ్యాంగులు ముందుకు సాగేలా తీర్చిదిద్దాలని ఎంఈవో కె.తాతారావు అన్నారు. సోమవారం దేవీ సెంటర్‌లోని భవిత కేంద్రం వద్ద గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు, గ్రామ ప్రముఖులు కె.వెంకట్రావు, బలుసు జానకిరామయ్య, కొరపాటి వీర్రాఘవులు, జె.మల్లిఖార్జునుడు, కట్టా మురళి తదితరులు మాట్లాడారు. చిన్నారులను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్న ఐఈఆర్టీ సునీతను పలువురు అభినందించారు. దివ్యాంగ విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందించారు. జుత్తుగ వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు జుత్తుల మల్లిఖార్జునుడు, కుటుంబ సభ్యులు వెంకన్న వర్ధంతిని పురస్కరించుకుని పండ్లు, భోజనాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లపల్లి సోని య, జుత్తుగ చినవీర్రాజు, చింతా పెదకాపు, ఫిజియోథెరపిస్ట్ ప్రియాంక, సీఆర్పీ సరిత, ఐఈఆర్టీ సునీత, కల్యాణి, దివ్యాంగుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించేందుకే..

కె.గంగవరం: దివ్యాంగులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం భవిత కేంద్రాలు ఏర్పాటు చేసిందని భవిత కన్వీనర్ సత్యనారాయణ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కె.గంగవరం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం దాతల సహకారంతో దివ్యాంగ పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, ఐఆర్టీ కేంద్ర నిర్వాహకుడు సత్యనారాయణ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

16న మండల పరిషత్ సమావేశం

మండపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 16న జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ తెలిపారు. ఎంపీపీ ఉండమట్ల వాసు అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో జరిగే మండల సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

12న జాబ్ మేళా

రావులపాలెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో 12న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఇండో ఎంఐఎం, పానాసోనిక్, కేఐఎంఎల్, హోండై తదితర ప్రైవేట్ కంపెనీలు ఇంటర్వ్యూలు జరుపుతాయన్నారు.

వెదురుపాకలో రేపు గీతా జయంతి

రాయవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గీతా మందిరంలో 11న గీతా జయంతి నిర్వహిస్తున్నట్టు సోమవారం గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. టిళ్లపూడి సూర్యనారాయణ శిష్య బృందం ఆధ్వర్యంలో మార్గశిర శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని తెల్లవారుజామున 4 గంటల నుంచి సామూహిక భగవద్గీత పారాయణ, హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. దీనికి ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ తీర్థస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారన్నారు. అనంతరం అన్న సమారాధన చేస్తామని వెదురుపాక పరిసర ప్రాంతాల భక్తులు గీతా జయంతిలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

గణిత పోటీ విజేతలు వీరే

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత పోటీ విజేతలను సోమవారం రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ, అకాడమీ కార్యదర్శి ఎం.నాగార్జున, ఎగ్జాంసెల్ నిర్వాహకుడు కె.శ్రీకృష్ణసాయి తెలిపారు. మూడో తరగతిలో తుమ్మలపల్లి హారిక, కె.అఖిల్, 4వ తరగతిలో ఎల్.సత్యరోషన్, ఎం.సునీత, 5వ తరగతిలో శ్రీరుత్విక్ కార్తికేయ, రెడ్డి విఘ్నేష్, 6వ తరగతిలో ముద్రగడ హసిని, చిక్కా గోవిందస్వామి, 7వ తరగతిలో ఈర్ల శ్రీమణి యశ్వంత్, మహ్మద్ షాహిల్, 8వ తరగతిలో మేకా కార్తీక చైతన్య, జేఎల్‌వీఎం మోహన్‌రాజు, 9వ తరగతిలో కోటి స్టీఫెన్‌రాజు, తిర్రి కుషాల్, 10వ తరగతిలో కొయ్యా ప్రణీత్ కార్తీక్, బేతిన శ్రీహిత పలు స్థానాలు పొందినట్టు తెలిపారు.

నాటుసారా కేసులో ఇద్దరి అరెస్ట్

కొత్తపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నాటుసారా అమ్మకాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు జరిపి ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన మల్లవరపు వెర్రియ్య 2 లీటర్ల నాటుసారాతో, వాడపాలెంకు చెందిన విసినేని బాలు వద్ద 2 లీటర్ల నాటుసారాతో అరెస్టు చేశామన్నారు. వీరిద్దరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో స్క్వాడ్ సీఐ ఎల్.చిరంజీవి, ఎస్ఐ కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

రాఘవన్‌కు పలువురి పరామర్శ



రాఘవన్‌ను పరామర్శిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పితృ వియోగం పొందిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్‌ను సోమవారం పలువురు పరామర్శించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, శాసనమండలి మాజీ వైస్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ వీవీఎస్ఎస్ చౌదరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు పోతంశెట్టి గోపాలకృష్ణ, పెంటపాటి శ్రీనివాస్, వీఆర్వోల సంఘం నాయకుడు మద్దాల బాపూజీ తదితరులు పరామర్శించారు.



ఉచ్చిలిలో రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తల బృందం

కంద సాగులో విత్తన ఖర్చు తగ్గించుకోవాలి

ఆత్రేయపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు కంద సాగులో విత్తనం ఖర్చు తగ్గించుకునేందుకు మినీసెట్ టెక్నాలజీ పద్ధతిని డెమానిస్ట్రేషన్ చేసి రైతులకు కేరళ శాస్త్రవేత్తల బృందం అవగాహన కల్పించారు. సోమవారం ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో అభ్యుదయ రైతు భూపతిరాజు వెంకటసుబ్బరాజు వ్యవసాయ క్షేత్రంలో కంద సాగుపై తిరువనంతపురం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.జనార్ధన్, డాక్టర్ పి.ప్రకాష్ రైతులకు శిక్షణ ఇచ్చారు. క్షేత్ర సందర్శన చేసి రైతులకు సస్యరక్షణ, పోషక యజమాన్యంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంబాజీపేట పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌసల్ పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

రాయవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) కౌసల్ పోటీ పరీక్షల్లో మాచవరం విద్యార్థులు సత్తా చాటారు. జిలాస్థాయిలో నిర్వహించిన కౌశల్ క్విజ్ పోటీల్లో పదో తరగతి విభాగంలో పడాల లోకేశ్వరరెడ్డి, ఒగ్గు కుశ్వంత్‌సాయి విజేతలుగా నిలిచి రూ.1500, రూ.1000 గెలుచుకున్నారు. విజయవాడలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగే పోటీల్లో వీరు పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయి ప్రతిభాన్వేషణ పోటీలకు మాచవరం విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం జి.సుబ్రహ్మణ్యం తెలిపారు.